www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 44 సంచిక : 18 విజయవాడ 20-1-2012 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...

- అమెరికా : నిరంకుశ చట్టానికి ఒబామా ఆమోదం
- మతకలహాలు-2011-డా॥ అస్ఘర్‌అలీ ఇంజనీర్
- ఎఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత సదస్సు తీర్మానాలు
- అడవిపై తమ హక్కుల అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజనులు

# కార్పోరేట్ కంపెనీల కోసమే సాగు యాంత్రీకరణ

**ఒక** అబద్ధాన్ని పదేపదే చెప్పటం ద్వారా ప్రజలు నిజమని నమ్ముతారని బూర్జువా మేధావుల ఉవాచ. దీన్నే గోబెల్స్ ప్రచారమంటారు. ఇప్పుడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ సేద్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇలాంటి ప్రచారమే జరుగుతున్నది. గ్రామీణ ఉపాధి పథకం వలన కూలీలు దొరకక రైతులు సేద్యం చేయటం కష్టంగా మారిందన్నదే ఆ ప్రచారం. భూస్వాములు, వారిఏజంట్లే కాకుండా కేంద్ర-రాష్ట్రాలకు చెందిన మంత్రులు కూడా ఈ ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం విజయవంతమైందనీ, అదే సందర్భంలో ఈ పథకం వలన వ్యవసాయ కూలీల కొరత ఏర్పడి, సేద్యానికి కూలీలు దొరకటంలేదనీ, దీని వలన ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతున్నదనీ, కూలీల కొరతను నివారించేందుకు 12వ పంచవర్ష ప్రణాళిక (2012-17)లో పంటల సాగుకి భారీ ఎత్తున యాంత్రీకరణ చేపడుతున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శరద్‌పవార్ చెబుతున్నారు. ఏ రాష్ట్రానికి వెళ్లినా అక్కడి ముఖ్యమంత్రి ముందుగా చెప్పేది కూలీల కొరత గురించేనని పవార్ చెప్పుకొస్తున్నాడు. అందువలన సేద్యానికి కూలీలు అందుబాటులో ఉండేటట్టు చూడాలి లేదా ప్రత్యామ్నాయాలను కనుగొనాలంటున్నాడు. అంటే వ్యవసాయ పనులను గ్రామీణ ఉపాధి పథకంలో చేర్చటం లేదా సాగుని యాంత్రీకరించటం మార్గంగా ఆయన శెలవిస్తున్నాడు. సాగులో వ్యవసాయ కూలీలకు లభ్యమౌతున్న పనిదినాలు తగ్గిపోతూ వారు జీవనం సాగించటం దుర్లభమవుతున్నందున, వారి జీవనోపాధికి సాగు పనిదినాలకు అదనంగా మరో వంద పనిదినాలు అందుబాటులోకి తేవటాన్ని ప్రకటిత లక్ష్యంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చారు.

వ్యవసాయ పనులను గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించటమంటే, ఆ పథకం ద్వారా కల్పిస్తామన్న పని రోజులకు తిలోదకాలు ఇవ్వటమే. సంవత్సరంలో వ్యవసాయపనులు దాదాపు వంద రోజులు ఉంటాయి. ఉపాధి పథకంలోని వందరోజుల పనికి వ్యవసాయ పనులే సరిపోతాయి. అందువలన ఆ పథకం క్రింద ప్రభుత్వం ప్రత్యేకంగా పనులు కల్పించాల్సిన అవసరం ఏర్పడదు. ఒకవేళ ఉపాధిహామీ పథకం పని దినాలు పెంచినా వ్యవసాయపనులకు, దాని కూలిరేట్ల విధానం ఎలా అమలు జరుపుతారు? వ్యవసాయ పనులను ఉపాధి పథకంలో చేర్చటమంటే భూస్వాములకు, ధనిక రైతులకు కూలీలను చౌకగా అందించటమే. అందుకే భూస్వాములు కోరుకుంటున్న విధంగా వ్యవసాయ పనులను ఉపాధి హామీ పనులలో అనుసంధానం చేస్తానని ప్రభుత్వం ప్రకటిస్తున్నది.

వ్యవసాయ పనులకు కూలీల కొరత ఉంది కాబట్టి, ఆ కొరతను నివారించటానికి సేద్యాన్ని యాంత్రీకరించటం మరో మార్గంగా కేంద్ర వ్యవసాయ మంత్రి చెబుతున్నాడు. ఇందుకోసం జపాన్, చైనా, తదితర దేశాల నుండి యంత్రాలను దిగుమతి చేసుకొంటామని ప్రభుత్వం చెబుతున్నది. తమ వద్ద పడిఉన్న వ్యవసాయ పనిముట్లను దిగుమతి చేసుకోవాలని బహుళజాతి సంస్థలు పాలకులపై వత్తిడి చేస్తున్నాయి. సాగు యాంత్రీకరణ పేరుతో విదేశీ కంపెనీల నుండి యంత్రాలను కొనుగోలు చేయటం ద్వారా, ఆ కంపెనీల ప్రయోజనాలను నెరవేరుస్తూ వాటికి లాభాలు తెచ్చిపెట్టేందుకు పూనుకొంటున్నారు. అవసరంలేని యంత్ర వినియోగం వలన సేద్యపు ఖర్చులు మరింత పెరిగేలాచేసి చిన్న, సన్నకారు రైతులు సేద్యం నుండి వైదొలగే పరిస్థితి కల్పించి వారి భూములను కాంట్రాక్టు, కార్పోరేట్ సేద్యానికి లీజుకివ్వటమో, అమ్మటమో చేయాల్సిన పరిస్థితిని కల్పించి, ఆ కంపెనీలవద్ద వారిని కూలీలుగా మార్చటం ప్రభుత్వ ధ్యేయంగా ఉంది. ఈ విధంగా భూస్వాముల, కార్పోరేట్ సంస్థల దోపిడీ ప్రయోజనాలను కాపాడుతూ, అందుకు చిన్న, సన్నకారు రైతులను బలిచేయనున్నది.

వ్యవసాయ మంత్రి చెబుతున్న దానిలో మరొక ప్రమాదం కూడా దాగి ఉంది. గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పేదలకు ఉపాధి అవకాశాలు ఎక్కువై పనులు దొరకని పరిస్థితి తొలగి పోయిందనే భ్రమ ఆయన ప్రకటనలో దాగిఉంది. అందుకే వ్యవసాయ పనులకు కూలీలు కరువయ్యారని చెప్పటం! మంత్రి శరద్‌పవార్ చెబుతున్నట్లుగా గ్రామీణ ఉపాధి హామీ పథకం విజయవంతం కాలేదని, కుటుంబానికి 100 రోజుల పని కల్పించటంలో విఫలమైందని, 28 రోజులకు మించి పనులు కల్పించలేదని, వారికి లభించే కూలి కూడా తక్కువగా ఉందని, ఉపాధి హామీ పథకం పనులు, వ్యవసాయ పనులకు అడ్డం కాదని, 90% పైగా కూలీలు వ్యవసాయ పనులకే పోతున్నారని అనేక సర్వేలు తెలియచేసిన విషయం వ్యవసాయ మంత్రి విస్మరించి మాట్లాడుతున్నాడు. సేద్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు వ్యవసాయ కూలీలు కారణం కాదని, పెరిగిన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల ధరలన్న వాస్తవాన్ని రైతులు తెలుసుకోకుండా మభ్యపెట్టేందుకు జరుగుతున్నదే ఈ ప్రచారం. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరిగితే, పనికోసం పెద్ద ఎత్తున సుదూర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన అవసరం గ్రామీణ పేదలకు ఎందుకు ఏర్పడింది? పుట్టిన ఊరును, కన్న తల్లిదండ్రులను వదిలి పెట్టాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది?

రాష్ట్రంలో సాగు యంత్రాలు వినియోగించే వారికి ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ప్రకటించింది. ఈ రాయితీ భూస్వాములకు, కార్పోరేట్ సంస్థలకు మాత్రమే అందుతుంది. చిన్న, సన్నకారు రైతులకు అందే అవకాశమే లేదు. శ్రీవరి సాగులో చేర్పులు, మార్పులు చేసి సాగు చేయటానికి, చెరకు సాగు విస్తీర్ణం పెంచటానికి యంత్రాలను సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ ప్రకటించింది. అందుకు 110 శ్రీవరి ప్రోత్సాహక కేంద్రాలు మరియు 37 చెరకు సాగు ప్రోత్సాహక కేంద్రాల ఏర్పాటుకి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను నోడల్ ఏజన్సీగా వ్యవసాయశాఖ నియమించింది. ప్రోత్సాహక కేంద్రాల నిర్వహణా, అభ్యర్థుల ఎంపిక చేసే ప్రక్రియ ఆగ్రోస్ ఆగస్టు 10న టెండర్లను ఆహ్వానించి అభ్యర్థుల ఎంపికను పూర్తిచేసింది.

శ్రీవరి సాగు చేయటానికి కావాల్సిన యంత్రాలకు 75.34 లక్షల రూపాయల వ్యయమౌతుంది. అందులో సగం సబ్సిడీ లభిస్తుంది. చెరకు సాగు యంత్రాలకు 133.35 లక్షలు వ్యయంకాగా అందులో 33.34 లక్షలు సబ్సిడీ ఇవ్వనున్నారు.

ఈ యంత్రాల కొనుగోలుకు అధికారులు ఆశించిన దరఖాస్తులు రాలేదు. ఈ యంత్రాలు కొనుగోలు చేయాలంటే కోటీశ్వరులుగా ఉన్న వారికే సాధ్యమౌతుంది. అందువలన పేద, మధ్యతరగతి రైతాంగం ఈ యంత్రాల గురించే ఆలోచించరు. ఇంత ఖరీదైన యంత్రాలతో వారు చేసే సేద్యం ఉండదు. ఆచరణలో కార్పోరేట్ కంపెనీలు మాత్రమే కొనుగోలు చేయగలుగుతాయి. చక్కెర మిల్లులు తాము యంత్రాలను కొని రైతులకు అద్దెకిచ్చేందుకు మహారాష్ట్రలో ఏర్పాట్లు పూర్తిచేశాయి. రైతులు, రైతు మిత్ర గ్రూపులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయటం సాధ్యం కాదు. అందువలన ప్రభుత్వం ప్రకటించిన రాయితీ కార్పోరేట్ సంస్థలు, బడా పరిశ్రమాధిపతులకే లభిస్తుంది. ప్రభుత్వం ఈ సబ్సిడీ ప్రవేశ పెట్టిందీ వారికోసమే!

**(తరువాయి 3వపేజీలో)**

సంపాదకీయం

# పోలియో నిర్మూలన-తత్కాలీన ఫలితాలు

**ఐదేళ్ళలోపు** పిల్లలకు సోకే వ్యాధి పోలియోవల్ల నాడీ వ్యవస్థ దెబ్బతిని బాలలు వికలాంగులవుతున్నారు. ఈ వ్యాధి నిర్మూలనకు భారత ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమంతో టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. 1988లో 3 లక్షల 50 మంది బాలలు పోలియో వ్యాధి బారిన పడగా, 2010 నాటికి వ్యాధికి గురైన వారి సంఖ్య 1349కి తగ్గింది. దీని కొరకు ప్రభుత్వం రూ. 12 వేల కోట్లు ఖర్చు చేసింది. అనేక విడతలుగా జరిగిన పల్స్ పోలియో ప్రతిసారి 20 కోట్ల కుటుంబాలకు చేరి 24 లక్షల టీకాలను అందించగలిగింది. చివరిసారిగా పశ్చిమ బెంగాలులో 18 నెలల పసిబాలికకు పోలియో సోకినట్లు 2011 జనవరి 13న నమోదు అయ్యింది. ఆనాటి నుండీ ఏడాదిపాటు పోలియో సోకినట్లు నమోదు కాలేదు. దీనితో ప్రభుత్వం పోలియో వ్యాధిని నిర్మూలించగలిగినట్లు ప్రకటించింది. “ఈ ఫలితం మాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. అదే సమయంలో మేము అప్రమత్తతతో వుంటామ”ని కేంద్ర మంత్రి ప్రకటించారు. పాలకులకు రాజకీయ కృతనిశ్చయముంటే కొన్ని ప్రజాసమస్యలనైనా పరిష్కరించగలరన్న విషయాన్ని యిది తెలుపుతున్నది.

అయితే విజయంగా ప్రకటించటం చాలా తొందరపాటు అవుతుంది. పల్స్ పోలియో కార్యక్రమాన్ని బలహీనపరిచేందుకు ఇది దారితీయవచ్చు. పోలియోవ్యాధి కలుషిత ఆహారం, త్రాగునీటి ద్వారా వ్యాపిస్తుంది. పేదలకు పరిశుభ్ర త్రాగునీరు లభ్యత మహానగరాలలోనే లేదు. కలుషిత ఆహారం ద్వారా వ్యాప్తి చెందే అతిసారం, కలరా వంటి వ్యాధులు ప్రతిఏడూ రావటమే, ప్రజల ఆరోగ్యం ఎంత దిగజారిన స్థితిలో వుందో తెలుపుతుంది. రక్షిత మంచినీటి పథకాల గురించి గణాంకాలతో ఎంత ప్రచారం చేసినా, అవి అమలు జరిగిన గ్రామాలలో కూడా మంచినీటి వ్యవస్థలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ స్థితిలో కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాప్తి చెందే పోలియో, నిర్మూలనా దశకు చేరుకుందనటం అతిశయోక్తిగానే వుంటుంది.

పోలియో వైరస్ సోకిన వారిలో వ్యాధి లక్షణాలు కన్పించకుండా అణిగివుండటం చాలా కాలం పాటు సాగుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక్క పోలియోవ్యాధి కూడా సోకకుండా ఐదేళ్లు వుంటేనే వ్యాధిని నిర్మూలించినట్లు పరిగణిస్తుంది. భారత దేశంలో పల్స్‌పోలియో మొదలైన తర్వాత కూడా నాలుగేళ్లకొకసారి వ్యాధి ప్రబలంగా కన్పించింది. 2002లో 15వేల కేసులు, 2006లో వెయ్యికి కొద్దిగాలోపు కేసులు, 2010లో 900 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాణం ప్రకారంచూసినా మరొకమూడేళ్లు ఆగితేనే తప్ప పోలియోనిర్మూలనపై ఒక నిర్ధారణకు రాలేము.

గతంలో వ్యాధుల నిర్మూలనకు భారత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసింది. ఈ కార్యక్రమాలన్నింటిలోనూ ఉన్న ఏకైక బలహీనత ప్రారంభ ఫలితాలు సాధించిన తర్వాత అదే వూపుతో కార్యక్రమాలను కొనసాగించలేకపోవటమే. అలా నిర్మూలించాగలిగామని ప్రకటించిన వ్యాధులు తిరిగి ప్రబలాయి. మలేరియా వ్యాధి నిర్మూలనా జాతీయ కార్యక్రమంతో దాన్ని నిర్మూలించగలిగామని గతంలో చెప్పారు. అనతి కాలంలోనే అది తిరిగి విజృంభించటంతో పాటు వ్యాధి కారక క్రిములు ఔషధాలకు లొంగని స్థితికి చేరాయి. అంతే కాక దోమకాటుతో వ్యాప్తి చెందే డెంగ్యూ, చికిన్‌గున్యా వంటి కొత్తవ్యాధులను తెచ్చింది. అలాగే బర్డ్‌ఫ్లూ వ్యాధి దేశంలో పౌల్ట్రీ పరిశ్రమను గడగడలాడించింది. దీనిని నిర్మూలించామని ప్రకటించిన మూడు రోజులకే ఒరిస్సా రాష్ట్రంలో ఇది ప్రబలంగా వ్యాపించింది.

కుష్ఠు, క్షయ వ్యాధుల నిర్మూలనా చరిత్ర అంతా వైఫల్యాలే. 2006లో కుష్ఠు వ్యాధిని నిర్మూలించానని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రపంచ దేశాలలో భారత్‌లోనే అత్యధిక సంఖ్యలో కుష్ఠు వ్యాధికి గురౌతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికలు తెలుపుతున్నాయి. క్షయవ్యాధి ఈ రోజుకీ అత్యధిక మరణాలకు కారణంగా వుంది. క్షయవ్యాధి నిర్మూలనా పథకాన్ని అమలు జరుపుతున్నామని చెబుతున్నప్పటికీ, దీనిలో పైచేయి సాధిస్తున్నామని తరుచుగా చెప్పుకుంటున్నప్పటికీ, మందులకు లొంగని వ్యాధిగా అది రూపొంది మరింత ప్రమాదకారిగా తయారౌతున్నది.

ఈ అనుభవం-అంటువ్యాధులను నిర్మూలించి ప్రజారోగ్యాన్ని కాపాడటంలో నిరంతరాయ అప్రమత్తత అవసరమౌతుందనీ, అది ఏ మాత్రం కొరవడినా వ్యాధులు తిరిగి ప్రబలుతాయనీ తెలుపుతున్నది. అంటు వ్యాధుల నిర్మూలనా కార్యక్రమాల్లో కొరవడుతున్న అంశమిదే.

దీని కంటే ప్రాధాన్యతగలిగిన అంశమొకటివుంది. సామాజిక, ఆర్థిక వ్యవస్థాపరమైనది. వైద్య సేవలను ప్రైవేటుపరం చేసి, వ్యాధులకు గురైన వారికి అందించే వైద్యంలో సాధించిన ప్రగతిని చూసి ఉప్పొంగి పొమ్మని చెబుతున్న ప్రభుత్వం, వ్యాధులు సోకకుండా నివారించగల ప్రజారోగ్య సేవలను పూర్తిగా వదలి వేసింది. వైద్యం కోసం ప్రజలు వెచ్చిస్తున్న సొమ్ము సంగతలా వుంచి, ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులలో పదోవంతు ప్రజారోగ్య సేవలకు ఖర్చు చేసినా వ్యాధులను నివారించవచ్చు. కనుక వ్యాధి నివారణా సేవలపై ప్రభుత్వ పెట్టుబడి మదుపును పెంచకుండా అంటువ్యాధుల నివారణ సాధించగలగటం పగటికలగానే వుంటుంది.

దేశంలోని ప్రజారోగ్యరక్షణ చర్యలను పటిష్టపరచకుండా, పొరుగుదేశాలలో ఇంకా పోలియో వ్యాధి వుందిగనుక అక్కడినుండి మన దేశంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటామనటం, సమస్య మూలాల నుండి దృష్టి మరల్చే ప్రయత్నమే అవుతుంది. పోలియో టీకాతో వున్న మరో ప్రమాదం పట్ల కూడా అప్రమత్తంగా వుండాలి. చుక్కల టీకాలను వాడుతున్నారు. దీనిలో బలహీన పరచబడిన పోలియో కారక సూక్ష్మక్రిమి వుంటుంది. కొన్ని సందర్భాలలో టీకాలోని ఈ సూక్ష్మక్రిమి వ్యాధిని కలిగిస్తుంది. గత ఏడాది కొత్తగా ఒక్కపోలియో కేసు నమోదు కానప్పటికీ, చుక్కల టీకావల్ల పోలియో వచ్చి పక్షవాతానికి గురైన బాలలు ఏడుమందిగా నమోదయ్యింది.

ప్రారంభ విజయాలతో ప్రచారార్భాటం మాని, వ్యాధి నివారణా కార్యక్రమాన్ని సమగ్ర రూపంలో కొనసాగించే దిశగా చర్యలు తీసుకోవాలి.

D

# మతకలహాలు –2011

**2010** సం॥రంతో పోల్చితే 2011 ప్రారంభ మాసాలలో మతహింస తక్కువగా జరిగినట్లు కన్పించినప్పటికీ తర్వాత నెలలో కొనసాగిన మతపరమైన దాడులు మరోసారి దేశం సిగ్గుతో తలదించుకునే విధంగా సాగాయి. 1992–93 నాటి ముంబయి దాడులతో లేదా 2002 నాటి గుజరాత్ దాడులతో సరిపోల్చదగిన ఘటనలు కాకున్నా దేశవ్యాపితంగా పలురాష్ట్రాల్లో ఈ దాడులు చోటు చేసుకున్నాయి.

మహారాష్ట్రలో యేవాత్ మహల్ జిల్లా ఉమర్‌ఖేడీలో 2011 జనవరి 13న కొందరు హిందూ యువకులు ఒక ముస్లిమ్ బాలికను అల్లరి పెట్టటంతో ఇరువైపుల నుండీ రాళ్ళు విసురుకోవటం ప్రారంభమైంది. పెద్ద స్థాయిలో హింస చెలరేగుతుందని భావించిన ప్రజలు, తమ చెప్పులను, బూట్లను వదలి భయంతో పరుగులు దీశారు. పోలీసు అధికారులు సకాలంలో సరైన విధంగా కదలటంతో ఆ సంఘటన అంత వరకే పరిమితమైంది. ఆడపిల్లలను అల్లరి పెట్టే విషయం వంటి వాటిల్లోనూ హిందూ, ముస్లిమ్ అంటూ విభజనకు గురౌతున్న దుస్థితి నెలకొంది. క్రికెట్ బంతి వచ్చి వీధుల్లో వెళ్తున్న వారినెవరినైనా తాకినా, రోడ్డుపైన ఏదైనా ప్రమాదం చోటు చేసుకున్నా ...ఇటువంటి అతి చిన్న అంశాలుకూడా మతరూపం సంతరించుకోవటమనేది–మతతత్వ శక్తుల నిరంతరాయ మత ప్రచార ప్రభావ ఫలితం; దీనితోపాటు మన విద్యావ్యవస్థ కూడా మన మనసులను ఏ విధంగా మలుస్తున్నదో స్పష్టమౌతున్నది.

ఫిబ్రవరి 7వ తేదీన ఒక క్రిష్టియన్ ఫాదర్‌కు, రిక్షా డ్రైవర్‌కు మధ్య ఏర్పడిన చిన్నపాటి వివాదం ఆశ్చర్యకరంగా హిందు–ముస్లిమ్ రంగుపులుముకుంది. ఒక ముస్లిమ్ దేవాలయం పైకి కొందరు రాళ్ళు విసరటంతో 10 మంది వ్యక్తులు గాయపడ్డారు. ఇంతేగాక వారు పలు దుకాణాలకు, వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ అల్లరి గుంపు ఆ ప్రాంతంలోని గిరిజనులను కూడా విడిచి పెట్టలేదు. దురదృష్టకర మేమంటే పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించకుండా ముస్లిమ్‌లు, ఆదివాసీలపైనే లాఠీఛార్జీచేసి తరిమారు. ఈ ఘటనలో ఎక్కువగా ముస్లిముల ఆస్తులు లక్ష్యంగా చేసుకొని ధ్వంసం చేయబడ్డాయి.

మతపరంగా మరో సున్నితమైన ప్రాంతం–గుజరాత్ రాష్ట్రం బరోడాలో ఫిబ్రవరి 16న కొందరు దుష్టశక్తులు ఈద్ పండుగ నిర్వహణకుద్దేశించి నిర్మిచిన ఒక ద్వారంపై దాడి చేయటంతో పాటు దానిని తగుల బెట్టారు. వీరు పలు వాహనాలను కూడా దగ్ధం చేశారు. బరోడాలో కహార్లు, ముస్లిములు తరచుగా తగువులు పడుతుంటారు. కొందరు కహార్లు, ముస్లిములు అక్రమమద్యం వ్యాపారంలో వుండటం దీనికి కారణం.

మార్చి 2వ తేదీన ముంబయిలో సెవ్రి ప్రాంతంలో కొన్ని మతతత్వ శక్తులు–ముస్లిమ్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గోడలపై అతికించిన పోస్టర్లను, కట్టిన జెండాలను చించి వేశారు. దీంతో ఈ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. మార్చి 5వతేదీన ఎవరో ఒక పిల్లవాణ్ణి నెట్టి వేశారనే కారణంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. ఇరువైపుల నుండీ రాళ్ళు రువ్వుకున్నారు. కొందరు ముస్లిమ్ స్త్రీలను అవమానాలకు గురిచేశారు. తిరిగి ఈ సందర్భంలోనూ పోలీసులు పక్షపాతంతో వ్యవహరించి ముస్లిమ్‌లపైనే లాఠీఛార్జీకి పాల్పడటంతో పాటుగా అనేక మంది ముస్లిమ్ యువకులను అరెస్టు చేశారు.

మహారాష్ట్రలో మతపరంగా సున్నితమైన మరో ప్రాంతం –ఔరంగాబాద్‌లో మార్చి 20న మరో ఘటన చోటు చేసుకుంది. ఆ రోజున కొందరు ముస్లిమ్ యువతీ యువకులు పరీక్షరాసి ఎస్.బి. కళాశాల నుండి తిరిగి వస్తున్నారు. ముస్లిమ్ యువతులు బురఖా ధరించి వున్నారు. కాగా, కొందరు మతతత్వ శక్తులు వీరిపై రంగులు చల్లారు–దీనిని ప్రతిఘటించినవారిపై కత్తులు బయటకు తీసి దుండగులు దాడికి పాల్పడ్డారు. సంఘటనా స్థలం నుండి తప్పుకున్న వారితో సహా దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ దాడులకు పాల్పడిన తమ కళాశాలకు చెందిన విద్యార్థులపై చర్యలు తీసుకొనేందుకు నిరాకరించింది. ఎస్.బి. కళాశాల యాజమాన్యంపై డా॥ అంబేద్కర్ మరట్వాడా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పాండే తగిన చర్య తీసుకున్నారు.

ఆసియా ఖండంలోనే ప్రసిద్ధి కెక్కిన ముంబయిలోని ధరావి మురికివాడ ప్రాంతంలో ఏప్రిల్ 6వ తేదీన హిందూ–ముస్లిమ్‌ల మధ్య మతపరమైన కొట్లాటలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. 1992–93 మతకలహాల అనంతరం ఏర్పడిన శాంతి కమిటీలు ఏమాత్రం క్రియాశీలకంగా వ్యవహరించటం లేదు.

మహారాష్ట్ర–దేశంలోనే మతపరంగా తీవ్రమైన సున్నిత రాష్ట్రంగావుండి, ప్రతి సంవత్సరం ఎక్కువ సంఖ్యలో మతకలహాలు ఈ రాష్ట్రంలో జరుగుతున్నాయి. మహారాష్ట్రలోనూ–ముంబయి దానిని ఆనుకున్న గ్రామీణ ప్రాంతాలు మరింత సున్నితమైన ప్రాంతాలుగా వున్నాయి. గత దశాబ్దం 2001–2011 మధ్య కాలంలో మహారాష్ట్రలో ఎక్కువ సంఖ్యలో మతకలహాలు జరిగాయి. మహారాష్ట్రలో చోటు చేసుకున్న 1,192 మత దాడులలోనూ (భారతదేశంలోనే ఈ రాష్ట్రంలో మత దాడుల సంఖ్య అత్యధికం) 172 మంది వ్యక్తులు హతమవగా, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన 1,112 మత పరమైన సంఘటనల్లో 384 మంది మరణించారు.

ఏప్రిల్ 25వ తేదీన మీరట్‌లో మతహింస బ్రద్దలైంది. దీనికి కారణం అత్యంత ఆశ్చర్యకరంగా ఒక గ్లాసెడు చల్లని మంచినీళ్ళు! ఏప్రిల్ 25వ తేదీన మీరట్‌కు సమీపంలోని క్వాజీపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన ముగ్గరు వ్యక్తులు ఛోటీమసీద్‌వద్దకువచ్చి మంచినీళ్ళు కావాలని అడిగారు. వారికి కుళాయి నీళ్ళు అందించగా తమకు చల్లని మంచినీళ్ళే కావాలని వారు డిమాండ్ చేశారు. చల్లని నీళ్ళు లేవని చెప్పినా వినిపించుకోకుండా ఆ వ్యక్తులు నీళ్ళు అందించే వ్యక్తిని, మసీదుకు చెందిన ఇమామ్‌ను, వీరికి మద్దతుగా వచ్చిన, అక్కడే చదువుకుంటున్న కొందరు పిల్లల్ని కొట్టటం ప్రారంభించారు. దాడులకు గురైనవారు పోలీసు స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. అనేకమంది ముస్లిములు పోలీస్ స్టేషన్ ఎదుట జమకూడి ఆందోళన నిర్వహించారు. పోలీసులపై రాళ్ళురువ్వారు. ఈ సంఘటనలో కొద్దిమంది పోలీసులకు, సిటీ మెజిస్ట్రేట్‌కు కూడా గాయాలయ్యాయి. ఆ తర్వాత ఈ గుంపు షాపులు, ఇళ్ళపై దాడులకు పాల్పడింది. అనేక పోలీసు స్టేషన్లకు ఈ గుంపు నిప్పుపెట్టింది. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసు అధికారులు అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలను మూసి వేయించారు. ఇదంతా ఒక గ్లాసు నీళ్ళదగ్గర ఏర్పడిన వివాదం కారణంగా! మీరట్ కూడా మతపరంగా సున్నితమైన ప్రాంతం. 1987లో ఈ ప్రాంతంలో జరిగిన మతహింస, ఆ సందర్భంగా ప్రొవిన్షియల్ ఆర్మ్‌డ్ కానిస్టేబుల్స్ 54 మంది ముస్లిము యువకులను వారి ఇళ్ళనుండి బయటకు ఈడ్చి వారిని కాల్చి చంపి సమీపంలోని హిందన్ కాలువలోకి విసిరిపారేశారు.

తరువాతి ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జరిగింది. కొందరు పోలీసులు ఒక ముస్లిమ్ ఇంటిలోకి చొరబడి ఒక నిందితునికోసం గాలించారు. ఈ సందర్భంగా వారు ఆ ఇంటిలోని ఆడవారిపట్ల అసభ్యంగా వ్యవహరించారు. అంతేగాక ఆ ఇంటిలోని 10 సం॥ బాలిక–నూర్జహాన్ నుండి ఖురాన్‌ను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. ఆ బాలిక కూర్చున్న మంచాన్ని పడదోశారు. ఈ ఘటనలు ముస్లిములను కోపోద్రిక్తుల్ని చేశాయి. తమపట్ల అమర్యాదగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు ఆందోళన చేపట్టారు.

తదనుగుణంగా పోలీసులు చర్యలు ఏమీ తీసుకోకపోగా, ముస్లిములను ఆ ప్రాంతం వదలి వెళ్ళి పోవలసిందిగా పదే పదే హెచ్చరించడంతో ముస్లిములు పోలీస్ స్టేషన్‌పై దాడికి పూనుకున్నారు. వాహనాలకు నిప్పంటించారు. పోలీసులపై రాళ్ళురువ్వారు. దీనితో మరింత బరితెగించిన పోలీసులు ముస్లిములపై పెద్దఎత్తున లాఠీఛార్జీకి పాల్పడటంతో పాటుగా కాల్పులు సాగించారు. ఇందులో ఇద్దరు ముస్లిములు, ఒక హిందువు, పెట్రోల్ బంకులో పనిచేసే మరొక ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డారు. కర్ఫ్యూ విధంచబడింది. పోలీసుల దాడులకు, అరెస్టులకు భయపడి గ్రామంలోని అత్యధిక ప్రజానీకం దగ్గరలోనున్న అడవిలోకి పారిపోయారు.

మహారాష్ట్ర–ఆంధ్రప్రదేశ్‌ల సరిహద్దులోనున్న అదిలాబాద్ జిల్లాలోని ఒక గ్రామంలో జులై 8వ తేదీన 6గురు ముస్లిములు సజీవంగా తగులబెట్టబడ్డారు. ఆదిలాబాద్ జిల్లా వటోరీ గ్రామానికి చెందిన ఒక మైనారిటీ ముస్లిమ్ ఇంటికి దుండగులు నిప్పంటించారు. దగ్గరలోనున్న భైంసా గ్రామానికి మతతత్వ హింసకు సంబంధించిన చరిత్ర కలిగి వుండటంతో ప్రభుత్వం జాగురూకతతో వుంది. బిజెపికి చెందిన విద్యార్థి విభాగమైన ఎబివిపి యొక్క ఉస్మానియా విశ్వవిద్యాలయ విభాగం, తెలంగాణా ఉద్యమం వంటి ప్రాంతీయ ఉద్యమాలను కూడా మతతత్వీకరించటంలో భాగంగా ఈ ఘటన చోటు చేసుకుంది.

జులై 12న ఆగ్రాలోని మంటోలా ప్రాంతంలో మతతత్వహింస చెలరేగింది. జబ్బున పడిన మేకను ఒక వ్యానులో ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మరో మతానికి చెందిన వారిని తగులుకుంటూ వెళ్ళటంతో వాగ్వివాదం ప్రారంభమై ఇరువర్గాలు మోహరించి రాళ్ళు రువ్వుకోవటం; ఆస్తులు, దుకాణాలు, ఇళ్ళు, వాహనాలు దగ్ధమవటంతో పాటుగా పోలీసులపైకి కాల్పులు జరిగాయి. పోలీసులు తిరిగి కాల్పులు చేశారు. ప్రైవేటు వ్యక్తుల కాల్పులలో డిఐజి వెంట్రుకవాసిలో ప్రాణ ప్రమాదం నుండి బయటపడ్డాడు. ఇళ్ళపై నుండి మతతత్వ వాదులు కాల్పులు సాగించారు. అతికష్టంమీద పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

మొరాదాబాద్‌లో ఆగష్టు 8న తిరిగి మత హింస చోటు చేసుకుంది. ముస్లిముల మసీదు వీధిగుండా గంగాజలాలను తీసుకొని శివభక్తుల ఊరేగింపు సాగటాన్ని అడ్డుకోవటంతో ఇది ప్రారంభమైంది. మొదట శివభక్తులు పోలీసులతో తలపడ్డారు. తరువాత వారు మసీదుపై కాల్పులు జరిపారు. ఇఫ్తార్ సమయం సమీపించటంతో పోలీసులు ఏ విధమైన చర్యలు తీసుకోవటానికీ సందేహించారు. మసీదు వద్ద నుండే ఊరేగింపు సాగిపోవాలని శివభక్తులు వత్తిడి చేశారు. ప్రార్ధనానంతరం ముస్లిములు బయటకు రావటంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. శివభక్తులు వారిని అడ్డుకున్నారు. మోటారు వాహనాలకు, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. అక్కడికి దగ్గరలోని మరో మసీదుపై రాళ్ళురువ్వారు. దగ్గరలో నిలిపివుంచిన అనేక వాహనాలకు నిప్పంటించారు. మెజారిటీ జనాభాగల ప్రాంతమైన బ్రిడ్జి క్రిందనుండి కాల్పులు సాగించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం సాగించిన దాడిగా స్పష్టమౌతున్నది.

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ పట్టణంలో ఆగష్టు 22న మతపరమైన ప్రదర్శనల విషయమై ఇరుమతాలకు చెందినవారిమధ్య, అతికొద్ది సమయంలోనే ఉద్రిక్తతలు పెరిగాయి. రాళ్ళురువ్వుకున్నారు. 6 పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు కర్ఫ్యూ విధించారు. ఈ కొట్లాటల్లో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జబల్‌పూర్‌కు కూడా మత పరమైన ఘర్షణలకు సంబంధించిన చరిత్రవుంది. స్వతంత్ర్య భారతదేశంలో తొలిసారిగా 1961లో అతిపెద్ద మత హింస ఇక్కడే చోటు చేసుకుంది.

ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాఇచ్‌లో ఆగస్టు 25న హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఈ ప్రాంతంకూడా మతపరంగా ఉద్రిక్తతలు తలెత్తే సున్నితమైన ప్రాంతం. ఒక మసీదు వెలుపల ఇరు మతాల మధ్య ఒక వివాదం తలెత్తి అది అతి త్వరగా హింసాత్మక రూపం తీసుకొంది. ఒకరు తీవ్రంగా గాయపడి మరణించగా, పలువురు ఈ దాడులలో తీవ్రంగా గాయపడ్డారు.

థానే జిల్లాలోని తిత్వాలాలో ఆగష్టు 25న మతహింస రాజుకుంది. జన్మాష్టమి సందర్భంగా జమకూడిన కొందరు హిందూ మతతత్వ దుండగులు ముస్లిమ్ యువకులను అడ్డగించి కొట్టారు. వారి ఆస్తులను, వాహనాలను ధ్వంసం చేశారు. తమపై హింసాత్మక దాడులకు సంబంధించిన ఫోటోలను వెంటతీసుకుని ఒక ముస్లిమ్ ప్రతినిధి బృందం మహారాష్ట్ర హోంమంత్రిని కలిసింది. ఈ హిందూ మతతత్వ దుండగులు ముస్లిమ్ పరిసర ప్రాంతాలలో తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేశారు. ఈ సందర్భంగా పోలీసుల పాత్రను కూడా ప్రతినిధి బృందం తప్పుపట్టింది.

ఈద్ దినాన–సెప్టెంబరు 2న మహారాష్ట్ర–అహమ్మద్‌నగర్ జిల్లాలోని నేవాసాలో మత హింస జరిగింది. పోలీసులు తీవ్ర పక్షపాత వైఖరితో వ్యవహరించారు. ఎఫ్ఐఆర్ ఇవ్వటానికి పోలీసుస్టేషన్‌కు వెళ్ళిన ముస్లిములనే అరెస్టు చేసి 307 సెక్షన్లపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. తరచూ ఈ విధంగా జరగటం కారణంగానే ముస్లిములు కనీసం ఫిర్యాదు చేయటానికి కూడా సాహసించటం లేదు. నేవాసానుండి అనేకమంది ముస్లిమ్‌లు తరలివెళ్ళి అహమ్మద్ నగర్‌లో తలదాచుకున్నారు.

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీలో సెప్టెబరు 3న మత కలహాలు జరిగాయి. ఉజ్జయినీలో ముస్లిమ్ జనాభా అధికంగా వుంటారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా 16 మంది గాయపడ్డారు. పాతబస్తీలోని దౌలత్‌గంజ్ ప్రాంతంలో ఒక దుకాణదారుడు గణేషుని విగ్రహాన్ని ప్రతిష్టించుకున్నాడు. ఇది అక్కడి మసీదు ప్రక్కనే వుంది. విగ్రహాన్ని ఏర్పరచటంతోనే గొడవలు ప్రారంభమయ్యాయా లేదా మరే కారణంగానో తెలియరాలేదు. ఒక మసీదుకు దగ్గరలోనే ఐనప్పటికీ గణేషుని విగ్రహాన్ని ఏర్పరచుకోవటం దానికదే గొడవలకు కారణమయే ఆస్కారంలేదు.

ఆంధ్రప్రదేశ్‌లోని–కర్నూల్ జిల్లా ఆదోని ప్రాంతంలో సెప్టెంబరు 7వ తేదీన మతహింసచోటు చేసుకుంది. ఈ ఘటనల్లో వందలాది మంది గాయపడగా ముగ్గరు తీవ్రంగా గాయపడ్డారు. మసీదు ఎదుట వాయిద్యాలు అనేవే తరచు ఉద్రిక్తతలను పెంచేవిగా వుంచున్నాయి. పోలీసులు గుంపులను చెదరగొట్టేందుకు పలుమార్లు లాఠీఛార్జి చేశారు. ఇరువర్గాలు రాళ్ళు రువ్వుకున్నారు. 4 గంటలకు పైగా ఈ దాడులు జరిగాయి. చివరకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. గణేషుని విగ్రహాల నిమజ్జనానికి మసీదు మీదుగా వాయిద్యాలతో తరలించటం ఈ ఉద్రిక్తతలకు కారణమైంది. ఇరువర్గాలు ఆటోలు, ట్రక్కులలో రాళ్ళను తీసుకువచ్చి మరీ దాడులు సాగించారు.

మహారాష్ట్రలోని ఆదివాసీ ప్రాంతమైన నందుర్‌బార్‌లో సెప్టెంబర్ 8న హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఇక్కడ కూడా గణేష్ విగ్రహాల నిమజ్జన సందర్భమే! ఇద్దరు వ్యక్తులు చనిపోగా అనేకమంది గాయపడ్డారు. చట్టవిరుద్ధంగా ఎలాంటి అనుమతులూ లేకుండా గణేషుని మండపాలు నిర్మించటమే దీనికి కారణం. వీటికి అనుమతినిచ్చిన పోలీసు ఇన్‌స్పెక్టర్ పక్షపాతంతో వ్యవహరించటమే కాకుండా ముస్లిమ్‌లను భీతావహులను చేశాడు. ఇక్కడ కూడా ఆస్తులు ధ్వంసం కాబడిన ముస్లిమ్‌లు ఫిర్యాదు చేయటానికి పోలీసు స్టేషన్‌కు వెళ్ళగా, వారినే అరెస్టు చేసి వారిపై 353 సెక్షన్ల క్రింద 32 మందిని అరెస్టు చేశారు. కాగా 12 మంది మాత్రమే ముస్లిమేతరులను అరెస్టు చేశారు. నందుర్‌బార్ ముస్లిమ్‌లు ఎంతగా భీతావహులైనారంటే తరాలుగా వారు నివసిస్తున్న తమగ్రామానికి తిరిగి వెళ్ళేందుకు వారు నిరాకరించారు.

సెప్టెంబరు 14న 2011 సంవత్సరంలోనే అతిపెద్దదైన మతపరమైన దాడి రాజస్థాన్‌లోని గోపాల్‌ఘర్, భరత్‌పూర్‌లలో జరిగింది. దీనిలో 11 మంది చంపబడగా వీరిలో 9 మంది పోలీసులు జరిపిన ఏకపక్ష కాల్పులలో మసీదులోనున్నవారే! మరణించారు. భరత్‌పూర్‌లో ప్రధానంగా ముస్లిమ్‌లు వుంటారు. ఈ పంచాయితీ పరిధిలోని కొంత భూమిని గ్రామ పంచాయితీ, ముస్లిములకు శ్మశాన స్థలంగా కేటాయించింది. దీనిని తమ పశువులకు సంబంధించిన చెరువు ప్రాంతంగా హిందువులు ప్రకటిస్తున్నారు.

అశోక్‌గెహ్లాట్ తన రాష్ట్రంలో మత ఉద్రిక్తతలను నియంత్రించటంలో విఫలమయ్యాడు. 2010లో రాజస్థాన్‌లో సరోదా, మంగల్‌థానా అనే ప్రాంతాల్లో పోలీసులు బాహాటంగా ఏకపక్షంగా దాడులు చేశారు. ఉదయపూర్ జిల్లాలోని సరోదాలో 30 ముస్లిముల కుటుంబాలు తగులబెట్టబడ్డాయి. ఇదంతా ఎస్‌పి మరియు జిల్లాకలెక్టరు సమక్షంలోనే! ఇంత జరిగినా గెహ్లాట్ ఈ అధికారులను కనీసం సస్పెండ్ కూడా చేయలేదు. అనేక ఆందోళనలు, విజ్ఞప్తులు నిరుపయోగమయ్యాయి. దీనితో పోలీసు ఉన్నతాధికారులలోని మతతత్వ దృష్టిగలవారు మరిన్నిప్రాంతాలలో మరింతఉదాసీనంగావ్యవహరించారు.

గోపాల్‌ఘర్‌లో తొలుత ఈ సంఘటనలు చోటు చేసుకన్నపుడు గెహ్లాట్ దీనిని ఒక చిన్న భూ వివాదంగా కొట్టివేశాడు. సోనియాగాంధీ జోక్యంతో ఎస్‌పి, కలెక్టరులను సస్పెండ్ చేయవలసి వచ్చింది. రాజస్థాన్‌లో మతపరమైన పరిస్థితి చాలా దారుణంగా వుంది. బిజెపి ఈ పరిస్థితినుపయోగించుకొని తిరిగి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నది. కాంగ్రెస్ ప్రతినిధి బృందం, పార్లమెంటు సభ్యుల ప్రతినిధి బృందం కూడా పోలీసుల ఏక పక్ష కాల్పులలో మసీదులోని 9 మంది మరణించారని నిర్ధారించిందికూడా! రాజస్థాన్‌లోని ముస్లిమ్‌లు గెహ్లాట్ వ్యవహారణా తీరుపై తీవ్ర ఆగ్రహంతోనున్నారు. అనేకమంది అతని అధికారిక కార్యక్రమాలకు బహిష్కరించారుకూడా!

భరత్‌పూర్ మతపరంగా సున్నితమైన జిల్లా అయినప్పటికీ ఆ జిల్లాలో ఒక గ్రామం– గోపాల్‌ఘర్–

**(తరువాయి 5వ పేజీలో)**

# అమెరికా నిరంకుశ చట్టానికి ఒబామా ఆమోదం

**నూతన** సంవత్సరం ప్రవేశిస్తున్న సమయంలో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా జాతీయ రక్షణ సాధికార చట్టానికి (ఎన్‌డిఏఏ) ఆమోదం తెలుపుతూ సంతకం చేశాడు. అమెరికా యుద్ధ యంత్రాంగానికి 66,200 కోట్ల డాలర్ల నిధులు సమకూర్చేందుకు చేసిన ఈ చట్టం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నది. ప్రపంచంలోని ఏ వ్యక్తినైనా బంధించటానికీ, ఎలాంటి విచారణకానీ, చట్ట ప్రకారం మరేవిధంగా కానీ అవకాశం లేకుండా నిరవధికంగా సైనిక నిర్బంధ శిబిరంలో వుంచే అధికారాన్ని ఈ చట్టం అమెరికా సైన్యానికిచ్చింది.

ఈ చట్టాన్ని ఆమోదిస్తూ ఒబామా సంతకం చేయటాన్ని అమెరికా సివిల్ లిబర్టీస్ యూనియన్ ఖండించింది. ఏసిఎల్‌యు ఎక్జిక్యూటివ్ డైరెక్టరు ఆంథొని రోమిరో ఒక ప్రకటనలో ఇలా అన్నాడు: "చట్ట ప్రకారం ఆరోపణా, విచారణా లేకుండా నిరవధికంగా బంధించే చట్టాన్ని ఆమోదించిన అధ్యక్షుడిగా ఒబమా ఎల్లప్పటికీ ఉండిపోతాడు...జార్జిబుష్‌కాలంలో అతిచర్యలను ఒబామా పాలన సరిచేస్తుందన్న ఆశ నేటితో కొడిగట్టిపోయింది."

అత్యంత పురాతనమైన ప్రజాస్వామిక హక్కు హెబియస్‌కార్పస్‌ను ఈ చట్టం రద్దు చేసింది. ఈ హక్కు క్రింద ఒక వ్యక్తిని ఎందుకు బంధించవలసి వచ్చిందో ప్రభుత్వం న్యాయస్థానం ముందు కారణాలను దానికి సాక్ష్యాధారాలనూ చెప్పాలి. ఈ హక్కు 17వ శతాబ్దంలో వచ్చిన ఇంగ్లీషు విప్లవ ఫలితంగా ఇంగ్లాండులో ఏర్పడింది. ఈ హక్కు రాచరికానికున్న అధికారాలను త్రుంచి వేసి పార్లమెంటు ఆధిపత్యాన్ని నెలకొల్పింది.

ఈ చట్టం క్రింద అమెరికన్ పౌరుడు, అమెరికాలో నివశిస్తున్న విదేశీపౌరుడు, మరే దేశ పౌరుడినైనా అమెరికా అధ్యక్షుడు గుర్తిస్తే, అమెరికా సైన్యం అతన్ని అరెస్టు చేసి జీవితకాలం బంధించి వుంచవచ్చు. "గుర్తించిన వ్యక్తి" అన్న పదాన్ని ఈ చట్టం ఇలా నిర్వచించింది: "అమెరికా, దాని కూటమి భాగస్వాములకు వ్యతిరేకంగా హింసా చర్యలు సాగిస్తున్న ఆల్‌ఖైదా, తాలిబాన్, తదితర శక్తులలో భాగమైన లేదా వాటిని సమర్ధిస్తున్న, అలాగే హింసా చర్యలు సాగించిన లేదా వాటికి ప్రత్యక్షంగా మద్దతు పలికిన వ్యక్తులతో సహా, వారిని" గుర్తించిన వ్యక్తులుగా నిర్వచించింది.

సెప్టెంబరు 11 టెర్రరిస్టు దాడికి కారకులైన వారిపై పోరాటమన్న సాకుతో తమ దాడి లక్ష్యాలుగా ప్రకటించిన వారికే ఈ నిర్వచనం పరిమితం కాలేదు. "అమెరికాకు, దాని కూటమి భాగస్వాములపై హింసా చర్యలు సాగించే" వారని అమెరికా అధ్యక్షుడు నిర్వచించే వారందరికీ వర్తిస్తుంది. అమెరికా కూటమి నాటోలో భాగస్వామి అయిన టర్కీలోని కుర్దు ప్రత్యేక దేశ వాదులూ, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, పాకిస్తాన్, యెమెన్, సోమాలియా దేశాలలో అమెరికా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాలను ప్రతిఘటించే వారందరికీ వర్తిస్తుంది. అంతేకాదు, ఒబామా కానీ, అతని వారసుడిగా వచ్చే తరువాయి అధ్యక్షులుగానీ ప్రారంభించ బోయే దురాక్రమణ యుద్ధాలను వ్యతిరేకించే వారందరికీ కూడా వర్తిస్తుంది.

అమెరికా నుండి సైనిక సహాయం పొందుతున్న రెండవ స్థానంలోని దేశం ఈజిప్టులో సైనిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న యువతకూ, నాటో కూటమిలోని దేశాలైన స్పెయిన్, గ్రీస్, ఇటలీలలోని ప్రభుత్వాల విధానాలపై పోరాడుతున్న ప్రజలకూ, అమెరికా సైన్యాలను ప్రపంచంలో ఎక్కడికైనా పంపటాన్ని వ్యతిరేకించే వారందరికీ ఈ చట్టం వర్తిస్తుంది.

ఇక్కడితో ఆగదు. అమెరికా సైనిక దురాక్రమణలనూ, అమెరికా దేశంలోపల సైనిక గూఢచారి యంత్రాంగం సాగిస్తున్న నిర్బంధ చర్యలనూ వ్యతిరేకిస్తున్న, అమెరికా విధానాలను వ్యతిరేకించే అమెరికా పౌరుడినెవరినైనా "అనుమానిత టెర్రరిస్టు"గా ముద్ర వేయవచ్చు. సైన్యం అతన్ని అరెస్టు చేయవచ్చు. నేరారోపణా, విచారణా లేకుండా నిరవధికంగా బంధించవచ్చు. విదేశాలపై దురాక్రమణ యుద్ధాలకు దేశం లోపల నియంతృత్వం కావాలని మరోసారి నిరూపితమైంది.

చరిత్ర జ్ఞానమున్న వారందరికీ ఎన్‌డిఏఏ చట్టం 1933 ఫిబ్రవరి 27న జర్మనీలో చేసిన రీచ్‌స్టాగ్ ఫర్ద్ డిక్రీ అన్నది గుర్తుకు రాక తప్పదు. రీచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంటు) భవనాన్ని కమ్యూనిస్టులు తగల బెట్టారన్న కుంటి సాకుతో, ప్రజాస్వామ్యాన్ని "పరిరక్షించే" చర్యల్లో భాగమని చెబుతూ వీమర్ ప్రభుత్వం ఈ చట్టాన్ని చేసింది. (అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకుడు డిమిట్రావ్‌ను నిర్బంధించింది ఈ చట్టంతోనే) ఈ చట్టంతో హెబియస్ కార్పస్‌తో సహా పౌర హక్కులను రద్దు చేశారు. ఈ చర్య మరుసటి ఏడే నాజీ నియంతృత్వం ఏర్పడటానికి తోడ్పడింది.

ఒక బిల్లును ఆమోదించి సంతకం చేసినప్పుడు అధ్యక్షుడు ఒక సంతక ప్రకటనను చేయటం అమెరికాలో ఒక ఆనవాయితీగా వుంది. ఎన్‌డిఏఏను ఆమోదిస్తూ ఒబామా కూడా ఒక సంతక ప్రకటన విడుదల చేశాడు. అందులో "అనుమానిత టెర్రరిస్టును బంధించటం, ఇంటరాగేషన్, విచారణ సంబంధించిన ఈ చట్టంలోని కొన్ని సెక్షన్లపై నాకు తీవ్ర అభ్యంతరాలు (రిజర్వేషన్స్)న్నాయి" అన్నాడు.

ఎన్‌డిఏఏలోని కొన్ని సెక్షన్లపై ఆయనకు అంగీకారం లేనప్పుడు, ఆ చట్టాన్ని తాను వీటో చేసివుండవచ్చును లేదా తన అభ్యంతరాలను తెలుపుతూ పరిశీలించమని కాంగ్రెసుకు త్రిప్పి పంపి వుండవచ్చును. కానీ ఆయన అలా చెయ్యలేదు. దాన్ని చట్టంగా ఆమోదించాడు. "ఒక జాతిగా మన సాంప్రదాయాలు విలువలను కాపాడతానని" వాగ్దానం మాత్రం చేశాడు.

సంతక ప్రకటనలో ఒబామా ఇలా చెప్పాడు: "ఒక అమెరికా పౌరుడిని విచారణ లేకుండా సైన్యం నిరవధికంగా బంధించటానికి నా పరిపాలన అనుమతించబోదని స్పష్టంగా చెప్పగోరుకుంటున్నాను. నిజానికి అలా చేయటం ఒక జాతిగా మన ముఖ్యమైన సాంప్రదాయాలూ, విలువలనూ భంగపరచటమౌతుంది. నిరవధిక బంధింపును అనుమతించేటప్పుడు అది మన రాజ్యాంగ చట్టానికీ, యుద్ధచట్టాలకూ, దీనికి వర్తించే అన్ని చట్టాలకూ అనుగుణ్యంగా వుండే విధంగా సెక్షను 1021కి నా పరిపాలన అర్ధాన్ని చెబుతుంది."

వాగ్దానాలు చేయటం సులభం. ఒబామా ఒక లాయరు. ప్రజాస్వామ్యానికి బద్ధుడినై వుంటానంటున్న అతని సంతక ప్రకటనకు ఎలాంటి చట్టబద్ధత లేదని అతనికి బాగా తెలుసు. ఈ మాటలు అలంకార ప్రాయం మాత్రమే. కాగా సంతక ప్రకటనలోని మిగతా భాగమంతా ఎన్‌డిఏఏలోని వివిధ సెక్షన్లను విమర్శించటంగానే సాగింది. ముసాయిదా బిల్లులో పార్లమెంటు సభ్యులు పౌరులకు రక్షణ యిస్తామంటూ చేర్చిన సవరణలివి. "టెర్రరిజంపై పోరు సాగిస్తున్న కార్యనిర్వాహక విభాగంపై ఇవి అతి ఆంక్షలుగా" వున్నాయన్నదే ఆ విమర్శ. సంతక ప్రకటనను విడుదల చేస్తూ అధ్యక్షుడి ప్రతినిధి పత్రికల వారితో ఇలా వివరించాడు : "మన దేశాన్ని సురక్షితంగా వుంచుతున్న చట్టాలను అమలు జరిపే, సైన్యపు, యంత్రాంగపు టెర్రరిజాన్ని అణచివేసే సామర్థ్యాన్ని ఈ సెక్షన్లేవీ నిరోధించకుండా చూస్తాము." దీని అర్ధమేమిటో సంతక ప్రకటన చివరిలో ఒబామా చెప్పాడు. "ఈ సెక్షన్ల అమలుకూ, నాకు రాజ్యాంగమిచ్చిన అధికారాలకూ మధ్యన ఘర్షణ ఏర్పడితే, ఆ సెక్షన్లు నాకు అమలు జరపాల్సినవి కానివిగా (నాన్‌బైండింగ్) పరిగణిస్తాను". అది ప్రజాస్వామ్యం పట్ల ఈయనకున్న గౌరవం. పౌరులకు రక్షణ కోసమంటూ పార్లమెంటు సభ్యులు చేసిన కొన్ని సవరణలను తాను అమలు జరపబోనని ప్రకటించాడు.

ఇదేమీ ఒట్టి భయాందోళనకాదు. ఇంతకంటే ప్రమాదకర అధికారాలనే ఇంతకు ముందే ఒబామా అమలు జరిపాడు. అధ్యక్షుడు "శతృయోధుడు"గా ప్రకటించిన అమెరికా పౌరుడిని ఎలాంటి నేరారోపణా, విచారణ లేకుండా హత్య చేసే "హక్కు"ను దఖలు పరచుకున్నాడు. అమెరికా పౌరుడూ, ఇస్లాం మత ప్రచారకుడూ ఆయిన అన్వర్ అల్ అవ్లాకీనీ అల్‌ఖైదా నాయకుడిగా పేర్కొంటూ అతనిని పైలెట్లు లేని విమానంతో క్షిపణులు వేసి చంపివేయటానికి అమెరికా అధ్యక్షుడు నాలుగు నెలల క్రితం సైన్యానికి అనుమతినిచ్చాడు. ఈ హత్యా ప్రయత్నంలో అమెరికా గూఢచారిసంస్థ క్షిపణులతో దాడి చేసి అమెరికా పౌరుడే అయిన అవ్లాకీ యొక్క 16 ఏళ్ల కుమారుడిని హత్యచేసింది.

ప్రపంచాధిపత్యం కొరకు అమెరికా సాగిస్తున్న సైనిక దురాక్రమణలకు ఎన్‌డిఏఏకు విడదీయరాని సంబంధం వుంది. దీనిలో సెక్షన్ల ప్రకారం తనయుద్ధ యంత్రాంగానికి లక్షలకోట్ల రూపాయల నిధులు కేటాయించింది. అదే సమయంలో అదే సెక్షన్లతో చమురు అమ్మకాల ద్వారా ఆదాయం రాకుండా గొంతు పిసికే ఆర్థికయుద్ధం కోసం ఇరాన్‌పై కొత్త ఆంక్షలు విధించగలదు. ఈ ప్రపంచాధిపత్యం కోసం పరుగులో తన దేశంలో కూడా నియంతృత్వ పాలన కొరకు సెనికీకరణ సాగిస్తున్నది. కనుకనే ఎన్‌డిఏఏ చట్టంతో "ఒకజాతిగా ముఖ్యమైన సాంప్రదాయాలు, విలువలను" కాలరాచిన ఒబామా తన సంతక ప్రకటన ద్వారా "ప్రజాస్వామ్యాని"కి కట్టుబడి వున్నానంటూ అమెరికా ప్రజలను వంచిస్తున్నాడు.

ఎన్‌డిఏఏను ఆమోదించటం చట్టబద్ధ పాలన సాగించాల్సిన యంత్రాంగాన్ని సైనికీకరించటమే. ప్రజాస్వామిక హక్కులను కాలరాచి పోలీసు రాజ్యాన్ని బలీయం చేయటమే. నేరారోపణా, విచారణాలేకుండా నిరంకుశంగా నిరవధికంగా బంధించే, యుద్ధాలను పెంచే చట్టానికి ప్రజాస్వామిక విలువన్న పందాడంబర అలంకారాలతో అమెరికా పౌరులకు ఒబామా నూతన సంవత్సర కానుకగా అందించారు. D

---

**కార్పొరేట్ ...** (మొదటి పేజీ తరువాయి)

పెద్ద పెద్ద యంత్రాలతోపాటు దుక్కినాగళ్ళు, దమ్ముచక్రాలు, గొర్రులు, డిస్క్ పడ్లర్లు, తైవాన్ పిచికారీ యంత్రాలు, స్ప్రేయర్లు, లెవల్‌బ్లేడు, షెల్లర్లు కేంద్ర (ఆగ్రోస్) తీసుకొంది. ఈ పనిముట్ల కొనుగోలులోనూ ప్రభుత్వం 50% రాయితీ ప్రకటించింది. ఈ యంత్రాల సరఫరాకు ప్రైవేటు కంపెనీలనుండి టెండర్లుపిలిచి ఖరారు చేశారు. బయట మార్కెట్‌లో యంత్రపనిముట్ల విక్రయ ధరలతో పోలిస్తే, ఆగ్రోస్ ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. బయట మార్కెట్‌లో అమ్మే యంత్ర పనిముట్లు స్థానికంగా తయారు చేసినవని, అవి నాణ్యత తక్కువని, ఆగ్రోస్ విక్రయించేవి జపాన్, చైనాల నుంచి తెప్పించిన మేలైనవని సమర్ధించు కొంటున్నారు. విదేశీ కంపెనీలతో పాలకులు, అధికారులు కుమ్మక్కుఅయి వారిచ్చే ముడుపులకు ఆశపడి వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువరేటుకి ఆగ్రోస్ యిచ్చే పరికరాలు నాణ్యమైనవి కాదని, నాసిరకమైనవేనని రైతులు చెబుతున్నారు. నాసిరకం ఇనుము వాడటం వలన దుక్కిలో గట్టి నేల, రాయి తగిలితే పరికరం దెబ్బ తింటున్నదని, ఇతర పరికరాలు ఇదేవిధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాల ధరల్లో ఆగ్రోస్‌కు, బయట మార్కెట్‌కు ధరల్లో ఉన్న వ్యత్యాసాన్ని క్రింది పట్టికలో గమనించవచ్చు.

యంత్రాలకు మార్కెట్టు ధరకన్నా అధిక ధరను నిర్ణయించి దానికి సబ్సిడీ యిస్తున్నట్లు చెబుతున్నది. ఉదాహరణకు దమ్ముచక్రాలకు రూ. 24,232 ధరగా నిర్ణయించి 50 శాతం సబ్సిడీతో 12116 రైతులకిస్తున్నట్లు చెబుతున్నది. కాగా వాటి మార్కెట్టు ధర 16 వేలు మాత్రమే వుంది. అంటే సబ్సిడీ రైతాంగానికివ్వటం లేదు. 8 వేల రూపాయలు అదనంగా యంత్రాల తయారీ కంపెనీలకిస్తుంది.

రాష్ట్ర కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై.) పథకం ద్వారా కోట్లాదిరూపాయలు రాయితీ యిస్తున్న ఈ యంత్ర విక్రయాల్లోనూ అవినీతి రాజ్యం ఏలుతున్నది. అధికార పార్టీ నాయకులు, అధికారులు యంత్రాలను పక్కదారి పట్టిస్తున్నారు. లక్షలాది రూపాయలు సబ్సిడీ లభిస్తున్న యంత్రాలను ఎం.ఎల్.ఏ.లు, మంత్రులు, స్థానిక పాలకపార్టీ నాయకులు బినామి పేర్లతో కైంకర్యం చేస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ కలెక్టర్ ఛైర్మన్‌గా, వ్యవసాయశాఖ జె.డి. కన్వీనర్‌గా ఆగ్రోస్ సంస్థ, ఉద్యానవన శాఖకు చెందిన ప్రతినిధులు సభ్యులుగా ఉండే కమిటీ రైతు మిత్ర గ్రూపులను యంత్రాల కోసం ఎంపిక చేస్తుంది. నాయకులు కమిటీలను ప్రభావితం చేసన్తూ యంత్రాలను చేజిక్కించుకొంటున్నారు. రాయితీ పోనూ మిగిలిన దానిలో 90% బ్యాంక్‌లో రుణంగా ఇస్తున్నందువలన నామమాత్రమైన డబ్బు చెల్లించి యంత్రాలను పొందుతున్నారు. కొన్ని జిల్లాల్లో రాజకీయ నాయకుల, మాజీ, తాజా ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులు సంఘాలుగా ఏర్పడి ఈ యంత్రాలను కాజేస్తున్నారు. క్రిష్ణా జిల్లా అందుకు ఒక ఉదాహరణ ఈ జిల్లాలోని ఉంగుటూరు మండలానికి 9 యంత్రాలు మంజూరు కాగా రైతుల పేరుతో 8 యంత్రాలు బినామీలే కొనుగోలు చేశారు. డీ.డీలు రైతుల పేరుతోనే చెల్లించారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకపోవటం అవినీతికి అద్దం పడుతున్నది.

**యంత్రాల ధరల్లో తేడాలు (రూపాయల్లో)**

| యంత్రపరికరం | ప్రభుత్వంధర(ఆగ్రోస్) | సబ్సిడీతో | మార్కెట్‌ధర | ప్రభుత్వ,మార్కెట్ ధరలతేడా |
|---|---|---|---|---|
| ప్లౌ (2 ఎం.చ) | 25,480 | 12,980 | 18,000 | 7,480 |
| దమ్ముచక్రాలు | 24,232 | 12,116 | 16,000 | 8,232 |
| కల్టివేటర్(11టైన్) | 23,088 | 12,585 | 16,000 | 7,088 |
| కల్టివేటర్ 9టైన్ | 22,048 | 11,024 | 15,000 | 7,048 |
| తైవాన్ స్ప్రేయర్లు | 14,000 | 7,000 | 8,000 | 8,000 |
| బురదగొర్రులు(టూత్‌యార్) | 9,238 | 4,738 | 6,000 | 3,258 |

(16-9-2011 ఈనాడు ఆధారంగా రూపొందించినది)

ఇప్పటికే కోత, నాటు యంత్రాలు వినియోగంలోకి వచ్చినా, అవి ఆచరణలో విఫలమైనాయి. కోత యంత్రాల మూలంగా ఎండుగడ్డిని రైతులు పూర్తిగా కోల్పోతున్నారు. దీని నష్టంతో పాటు పశుగ్రాసం సమస్యగా మారుతున్నది. యంత్రాలకు హెచ్చు డబ్బు చెల్లించాల్సి వస్తున్నది. వీటన్నింటి మూలంగా నష్టదాయకంగా మారటంతో రైతాంగం యంత్ర వినియోగానికి దూరంగా ఉంటున్నారు. ఇప్పుడు ప్రవేశపెడతామంటున్న యాంత్రీకరణ కూడా ఈ విధంగానే వైఫల్యం చెందుతుందనటంలో ఎలాంటి సందేహంలేదు.

భూస్వాముల, బడా పెట్టుబడిదారుల, విదేశీ కంపెనీల దోపిడీ, లాభాల కోసం ప్రవేశ పెట్టే సేద్యపు యాంత్రీకరణ వలన గ్రామీణ పేదల జీవితాలు మరింత ఛిన్నాభిన్నమౌతాయి. తాజా సర్వే ప్రకారం 70% మంది ప్రజలు ఇప్పటకీ గ్రామీణ ప్రాంతంలోనే నివశిస్తున్నారు. వీరిలో వ్యవసాయ కూలీలు, పేద, మధ్యతరగతి రైతాంగం, చేతివృత్తులవారు 80% పైగా ఉన్నారు. దీన్ని గమనిస్తే సేద్యానికి మానవశక్తి అపారంగా అందుబాటులో ఉంది. ఈ శక్తిని ఉపయోగించుకొంటే ప్రస్తుతం యంత్రాల వినియోగపు అవసరం ఉండదు. అందుకు అవసరమైన విధానాలను ప్రభుత్వం అనుసరించక పోవటం వలన ఉపాధి అవకాశాలు లేక గ్రామీణ పేదల శక్తి నిర్వీర్యమైపోతున్నది. వీరికి తగిన విధంగా పనులు కల్పించబడి ఉంటే అపారంగా అన్నిరకాల వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేవి. గ్రామీణ పేదలకు అలాంటి పని భూసంస్కరణల ద్వారా వారికి భూములు పంపిణీ చేసినప్పుడే సాధ్యమౌతుంది. భూస్వామ్య వర్గ ప్రయోజనాలను కాపాడుతున్న పాలకులు తెచ్చిన భూసంస్కరణలు పేదలకు భూములు పంచలేక పోయాయి. చేయబడిన భూ సంస్కరణలు కూడా భూస్వాముల ప్రయోజనాలకు నష్టం లేకుండా చేయటమే అందుకు కారణం, వీటన్నిటినీ పరిగణలోకి తీసుకొంటే విప్లవ భూ సంస్కరణలను అమలు జరిపి గ్రామీణ పేదలకు భూ పంపిణీ చేయాల్సిన ఆవశ్యకత అర్ధమౌతుంది. ఇలాంటి భూ సంస్కరణలు జరిగి రైతాంగం సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకొన్నప్పుడు మానవశక్తికి, యాంత్రిక శక్తి తోడై గ్రామీణ ప్రాంత అభివృద్ధితో పాటు దేశ ప్రజల ఆహార అవసరాలను పూర్తిగా తీర్చటం జరుగుతుంది. మనరాష్ట్రంలో నూటికి 50% దాకా భూమిలేని గ్రామీణ పేదలు ఉన్నారు. అంతే కాకుండా సేద్యంలో చిన్న, సన్నకారు రైతుల కమతాలు అత్యధికంగా ఉన్నాయి. వరి సేద్యానికి యంత్రాల అవసరం ఏమాత్రం ఉండదు. కుటుంబ సేద్యానికి సరిపోతుంది. వారి శ్రమ ద్వారా సేద్యపు ఖర్చులు తగ్గించుకొంటారు. అందువలన నేటి వ్యవసాయ యాంత్రీకరణ విధానాలను రైతాంగం-గ్రామీణ పేదలు సమైక్యంగా వ్యతిరేకించాలి.

గ్రామీణ ఉపాధిని పెంచే విధంగా వ్యవసాయ రంగంలో పనులు కల్పించాలని, కాంట్రాక్టు-కార్పొరేట్ సేద్యాన్ని విడనాడాలని, పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని రైతాంగం, గ్రామీణ పేదలు సమైక్యంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం ఎక్కుపెట్టాలి. D

# 2011 డిసెంబరు 19 విశాఖపట్నం

# ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత సదస్సు ఆమోదించిన తీర్మానాలు

## 1. కార్మిక-రైతాంగ ఐక్యతను సాధిద్దాం

కార్మికవర్గపు పని పరిస్థితులు, జీవన స్థితిగతులూ నానాటికీ దిగజారిపోతున్నాయి. సామ్రాజ్యవాదుల, భారతబూర్జువాల పెట్టుబడి, కార్మికుల హక్కులన్నింటి పైనా ఎడతెగని దాడులు సాగిస్తున్నది. తద్వారా వేతన బానిసత్వంతో వారి శ్రమను మరింతగా దోచుకుంటున్నది. కార్మికవర్గానికి ఎలాంటి స్వేచ్ఛలూ అనుమతించని ప్రస్తుత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బూటకమైందని గత 60 ఏళ్ల పైగా కార్మికవర్గం పొందిన చేదు అనుభవాలు తెలుపుతున్నాయి. కోట్లాది ప్రజలను దోచుకుని గుప్పెడు మంది సంపన్నులయ్యేందుకు తోడ్పడే పెట్టుబడి పాలనను తొలగించి, ప్రతి ఒక్కరూ శ్రమిస్తూ సమిష్టి శ్రమ ఫలితాన్ని అందరూ అనుభవించే సోషలిస్టు వ్యవస్థను స్థాపించితేనే తప్ప కార్మికవర్గం వేతన బానిసత్వం నుండి విముక్తి పొందజాలదు. సోషలిజం స్థాపన కార్మికవర్గ చారిత్రక కర్తవ్యం.

భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదాల కాడి క్రింద నలిగిపోతున్న ఇతర వర్గాలు విముక్తిని సాధించకుండా కార్మికవర్గం సోషలిస్టు విప్లవాన్ని సాగించలేదు.

దేశ అత్యధిక ప్రజానీకం వ్యవసాయం మీదే జీవిస్తున్నారు. వారి శ్రమ ఫలితాన్ని భూస్వాములూ, బడాబూర్జువాలు, సామ్రాజ్యవాదులు దోచుకుంటున్నారు. అన్ని రకాల ప్రభుత్వాలూ ఈ దోపిడీ వర్గాల ప్రయోజనాలను నెరవేర్చే విధానాలనే అమలుచేస్తూ, రైతాంగాన్ని మోసగించే బూటకపు నినాదాలు యిస్తున్నారు. ఫలితంగా రైతాంగం వినాశనానికి గురౌతున్నారు. భూమిని కోరే, స్వేచ్ఛను కోరే రైతాంగ ప్రజాస్వామిక ఆకాంక్షలను ప్రభుత్వాలు నెరవేర్చటం లేదు.

భారత సమాజ పురోగమనానికి ప్రధాన ఆటంకాలుగా నిలిచిన భూస్వామ్య విధానం, దళారీ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాద ఆధిపత్యాలు అన్ని వర్గాల ప్రజలకూ ఉమ్మడి శతృవులు. ఈ ఉమ్మడి శతృవుల పాలనను అంతమొందించనిదే పెట్టుబడిపై కార్మికవర్గ పోరాటం పురోగమించి సోషలిజాన్ని సాధించలేదు.

కనుక ప్రస్తుత సమయంలో కార్మికవర్గపు ప్రధాన కర్తవ్యం సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని తొలగించి భూస్వామ్య విధానాన్ని సంపూర్ణంగా రద్దుచేసి విముక్తిని సాధించే రైతాంగంతో ఐక్యతను సాధించడం. దున్నేవానికే భూమి పంపకం ద్వారా భూస్వామ్య విధానాన్ని సంపూర్ణంగా రద్దు చేసే ప్రజాస్వామిక చర్య, సామ్రాజ్యవాద దోపిడీ ఆధిపత్యాలను పారద్రోలే జాతీయ చర్య ద్వారా మాత్రమే దోపిడీ పీడనలు లేని సోషలిస్టు సమాజ స్థాపన కొరకు పోరాటానికి అత్యంత అనుకూల పరిస్థితులను తమ కోసం కార్మికులూ, రైతాంగం సృష్టించుకోగలరు.

కార్మిక, కర్షక ఐక్యతకు గల ప్రాధాన్యత యిది. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటం దాని చారిత్రక కర్తవ్యం. పోరాడుతున్న కార్మిక, కర్షకులు తమ పోరాటంలో యిమిడివున్న చారిత్రక కర్తవ్యాన్ని పూర్తిగా అవగాహన చేసుకోకపోయి వుండవచ్చు.

ఉమ్మడి శతృవులైన భూస్వామ్య విధానం, దళారీ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేక పోరాటంలో కార్మిక-కర్షక ఐక్యత సాధిద్దామని ఈ సదస్సు పిలుపునిస్తున్నది.

## 2. గఢాఫీ హత్యను ఖండిస్తూ. సామ్రాజ్యవాదుల జోక్యం, కుట్రలు, దురాక్రమణలను ఖండిస్తూ

లిబియాపై నాటో దేశాలు, అమెరికా కలసి సాగించిన దుర్మార్గ దురాక్రమణ దాడిని, లిబియా అధ్యక్షుడు ముహమ్మర్ గడాఫీని హత్య చేయడాన్ని ఈ సదస్సు తీవ్రంగా ఖండిస్తున్నది. లిబియాపై దురాక్రమణ యుద్ధంవెనుక ఆఫ్రికా ఖండంలోని ఉత్తర ప్రాంతంలోని దేశాలపై ఆధిపత్యాన్ని, స్థావరాలను, నెలకొల్పుకోవడం, అక్కడి ప్రజా నిరసన ఉద్యమాలను దెబ్బతీయడం కోసమేనన్నది స్పష్టం. మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా దేశాలలో కల్లోల పరిస్థితులను సృష్టించడం, కుట్రలు, దురాక్రమణలకి పూనుకుంటున్న అమెరికా, నాటోల విధానాలను సదస్సు ఖండిస్తున్నది. ట్యునీషియాలోని శ్రామిక ప్రజల ఉద్యమాలకు, సామ్రాజ్యవాదుల దోపిడీ, విభజన, చీలిక, అణచివేతలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజానిరసనోద్యమాలకు ఈ సదస్సు సంఘీభావం ప్రకటిస్తున్నది.

## 3. పాకిస్థాన్‌పై అమెరికా దాడులను ఖండిస్తూ

అమెరికా సామ్రాజ్యవాదం తన విస్తరణవాద యుద్ధాన్ని ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి ఇపుడు పాకిస్థాన్‌వైపు నడిపిస్తున్నది. టెర్రరిజంపై దాడి పేరుతో పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని నిరాకరిస్తూ అమెరికన్ సైనికులే నేరుగా ఒసామా బిన్ లాడెన్‌ను హత్య చేశారు. ఆఫ్-పాక్ యుద్ధం పేరుతో మానవరహిత (డ్రోన్) విమానాల ద్వారా పాక్ సరిహద్దు పాకిస్థాన్ గ్రామాలపై విచ్చలవిడిగా బాంబులేస్తూ ప్రజల ప్రాణాలను బలికొంటున్నారు. దీనికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజాగ్రహంను చూసి పాకిస్థాన్ పాలకులు అమెరికాను ఖండించినా సామ్రాజ్యవాదుల విస్తరణకి బంటుగా ఉపయోగపడినవారికి కూడా సామ్రాజ్యవాదం చివరకు ఏ గతి పట్టిస్తుందో ఇది తేటతెల్లం చేస్తున్నది. పాకిస్థాన్ భూభాగంపైన, పాకిస్థాన్ ప్రజలపైన అమెరికా సైనిక దాడులను ఈ సదస్సు ఖండిస్తున్నది. ఈ దురాక్రమణ దాడులకు నిరసనగా కదులుతున్న పాకిస్థాన్ ప్రజలకి సంఘీభావం ప్రకటిస్తున్నది.

## 4. నేటి ప్రపంచవ్యాపిత సంక్షోభానికి సోషలిజమే ఏకైక ప్రత్యామ్నాయం

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం నానాటికీ పరిష్కరించలేని సంక్షోభపు ఊబిలో మునిగిపోతున్నది. తను సృష్టించిన ఈ సంక్షోభాన్ని పెట్టుబడిదారీ దేశాలలోని కార్మిక, ప్రజారాశులపైన, ప్రపంచ దేశాలపైనా మోపి తమ దోపిడీని పరిరక్షించుకోవాలని పెట్టుబడిదారీ విధానం చూస్తున్నది. దీని కోసం కార్మికవర్గంపై తీవ్రమైన రాజకీయ దాడిని సాగిస్తూ కార్మిక వర్గ పోరాటాల ఫలితంగా సాధించుకొన్న హక్కులను కాలరాస్తున్నది. ఫలితంగా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలో కార్మిక, ప్రజల నిరసన ఆగ్రహజ్వాలలు నానాటికీ పెల్లుబుకుతున్నాయి. గ్రీసు కార్మికులు, ప్రజలు దీర్ఘకాలంగా సాగిస్తున్న పోరాటం, పొదుపు చర్యల పేరిట హక్కులు, సౌకర్యాల కాలరాతకు వ్యతిరేకంగా స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ కార్మికులు సాగిస్తున్న ఆందోళనలు, సామ్రాజ్యవాద నడిగడ్డ మీద వాల్‌స్ట్రీట్ ఆక్రమణ పేరిట లక్షలాదిమంది కార్మిక, ప్రజల సమీకరణ, దీనికి ఉదాహరణలు.

యూరప్, అమెరికా కార్మికవర్గం వారానికి 5 రోజులు పని, 35 గంటలు పని కాలాన్ని డిమాండ్ చేస్తూ యాంత్రీకరణ పేరుతో సామ్రాజ్యవాదం పెంచుకొంటూపోతున్న శ్రమశక్తి దోపిడీని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఇంకెంత మాత్రం ప్రపంచానికి ఉపయుక్తం కాదని, అది ప్రపంచ మానవాళి పురోగతికి ఒక గుదిబండగా మారిందని స్పష్టమౌతున్నది. నేటి ప్రపంచ సామ్రాజ్యవాదం సృష్టించిన రుగ్మతలకు సోషలిజమే ఏకైక శాస్త్రీయ, పరిష్కారమని కూడా ఈ సదస్సు ప్రకటిస్తున్నది.

ఈ సదస్సు అమెరికా, యూరప్‌లలో పెట్టుబడి సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా శ్రామిక-ప్రజా ఆందోళనలకు జేజేలు చెపుతున్నది, సంఘీభావం ప్రకటిస్తున్నది.

## 5. కార్మిక హక్కులపై దాడిని ఖండిస్తూ

భారత కార్మికవర్గం ఎన్నో పోరాటాల, త్యాగాల బాటలో నడిచి సాధించుకొన్న హక్కులను, సౌకర్యాలను, రాయితీలను కాలరాచే కుట్రలు నానాటికీ తీవ్రతరమౌతున్నాయి. బడా పెట్టుబడిదారీ సంస్థలు, వాటితో కుమ్మక్కైన రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు నేటి ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల పేరుతో అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలలో భాగంగా సృష్టించిన వాతావరణంలో ఈ హక్కుల విధ్వంసం సాగుతున్నది. రోజుకి 8 గంటలు పని అన్న కార్మికుల హక్కు నేడు కాలరాయబడుతూ 10-14 గంటల పని అప్రకటితంగా అమలు చేయబడుతున్నది. బడా పారిశ్రామిక సంస్థలు, ముఖ్యంగా బహుళజాతి సంస్థలు కార్మికుల కనీస హక్కైన యూనియన్ ఏర్పాటునే నిరాకరిస్తున్నాయి. ప్రభుత్వాల కుమ్మక్కుతో అన్ని రకాల చట్టపర, చట్టవ్యతిరేక అనైతిక, దౌర్జన్య పద్ధతులతో యూనియన్ నిర్మించుకొనే కార్మిక హక్కును కాలరాస్తున్న తీరు మారుతీ సుజుకీ, ఫాక్స్‌కాన్, డన్‌లప్, ఆల్ట్రాటెక్, మై హోమ్ వంటి కంపెనీల దుర్మార్గమైన విధానాలతో వెల్లడవుతున్నది. మరో పక్క పారిశ్రామిక సంస్థలలో 90 శాతం స్థానాలు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల చేత నింపివేయబడుతూ ఒకే వేతనం, సౌకర్యం, రక్షణ అన్న హక్కు కాలరాయబడుతోంది.

భారత రాజ్యాంగ వ్యవస్థలోని న్యాయ, శాసన, కార్యనిర్వహణ విభాగాలన్నీ కార్మికుల సమ్మె హక్కును ప్రశ్నించడం నుండీ ప్రతి న్యాయమైన ఆందోళనను కాలరాయడంలో యాజమాన్యాలతో పాటే నిలుస్తున్నాయి. యజమానులు కార్మికులపై తమ సిబ్బంది ద్వారా, ప్రైవేటు గూండాల ద్వారా భౌతిక దాడులు, బెదిరింపులు యధేచ్ఛగా సాగిస్తున్నారు.

ఈ పరిణామాలన్నింటినీ ఈ సదస్సు తీవ్రంగా పరిగణిస్తూ కార్మిక హక్కులపై బడా పెట్టుబడి సాగిస్తున్న అన్ని రకాల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న, సృష్టిస్తున్న కార్మికవర్గ వ్యతిరేకతలను, కార్మికులపై చేస్తున్న చట్టపర దాడులను ఖండిస్తున్నది.

## 6. వ్యవసాయరంగ సంక్షోభ పరిష్కారానికై

నూతన ఆర్థిక విధానాల అమలు పేరుతో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలన్నీ అనుసరించిన సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలే నేటి వ్యవసాయరంగపు తీవ్రమైన సంక్షోభానికి కారణం. ప్రభుత్వాలన్నీ వ్యవసాయరంగానికి ఇస్తూ వచ్చిన మద్దతు చర్యలను ఉపసంహరించడంతో నీరు, విద్యుత్, ఎరువులు తదితర ఉత్పత్తి కారకాల ధరలు పెరిగిపోయాయి. ఫలితంగా రైతాంగం అధిక వడ్డీలకు అప్పు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టాల్సివచ్చింది. మరో ప్రక్క ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించే యంత్రాంగాలన్నింటినీ ఉపసంహరించి రైతులను ప్రైవేటు వ్యాపారుల దోపిడీకి వదిలివేసింది. ప్రభుత్వాలు ప్రకటించే కనీస మద్దతు ధర ఆచరణలో గరిష్ట అంతిమ ధరగా మారిపోయింది. దీనితో పేద, మధ్యతరగతి రైతాంగం క్రమంగా అప్పుల ఊబిలోదిగబడి ఆస్తులకి మించిన అప్పులతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఫలితంగా దేశ వ్యాపితంగా 1991 నుండి 2001 మధ్య కాలంలో 2 లక్షల 50 వేల మంది రైతాంగం అత్మహత్యలు చేసుకోగా 70 లక్షల మంది రైతులు జీవనాధారమైన వ్యవసాయాన్ని, భూములను కోల్పోయారు. ఈ దశాబ్దపు లెక్కలు పూర్తిగా అందాల్సి ఉన్నా వ్యవసాయాన్ని వదిలిపెడుతున్న రైతాంగపు సంఖ్య గత దశాబ్దపు సంఖ్యకన్నా హెచ్చుగానే ఉంది. చెల్లాచెదరైన రైతాంగం జీవితాలు ఏ గౌరవ ప్రదమైనవృత్తి లేక అంతరించిపోతున్న పరిస్థితి ఉంది.

కొనసాగుతున్న ఈ సంక్షోభం యొక్క ప్రభావం ముఖ్యంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి మీద తీవ్రంగా ఉంది. అంతేగాక సారవంతమైన వ్యవసాయక భూములు వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం పెరిగింది. ఇది భారతదేశంను ఆహారభద్రత విషయంలో విదేశాలపై మరింత పరాధీనమయ్యే పరిస్థితికి దారితీస్తుంది. ఇది మరింతగా విషమించి సామాన్య ప్రజలు పెరుగుతున్న ధరలతో ఆహార పదార్థాలను కొనలేక అర్థాకలితో బతుకులీడ్చేవారుగా మారుస్తుంది.

ఈ వ్యవసాయక సంక్షోభమే గ్రామాల నుండి పట్టణాలకు పొట్ట చేత పట్టుకొని పోయే మహా వలసలను సృష్టించింది. వలస వస్తున్న దళిత, ఆదివాసీ, గ్రామీణ ప్రజలతో పట్టణాల మురికివాడలు కిక్కిరిసిపోతూ కొత్తవి ఏర్పడుతున్నాయి. ఈ వలసలే చౌక శ్రామికులను సృష్టిస్తూ కార్మికులు బేరమాడే శక్తిని హరించి వేస్తున్నాయి. సాంఘిక భద్రత, వేతనాలు, సౌకర్యాలను కుదించి వేస్తున్నాయి. గ్రామాల నుంచి సాగుతున్న జనజీవన విధ్వంసపు వలసల వెనకఉన్న అసలు కారణాలను మరుగుపరచి గ్రామీణ ప్రాంతపు కూలీల కొరకు యాంత్రీకరణ పరిష్కారంగా ముందుకు తేబడుతున్నది. ఈ యాంత్రీకరణ గ్రామంలో తరిగిపోతున్న ఉపాధి అవకాశాలను మరింత దెబ్బతీసి మరిన్ని వలసలకు కారణమవుతుంది. రైతుకూలీలే కాక పేద, మధ్యతరగతి రైతాంగం కూడా పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు, యాంత్రీకరణ భారాలను మోయలేక భూమిహీనులై పోయే క్రమం ఊపందుకొంటున్నది. గ్రామీణ భూస్వామ్య ధనిక దోపిడీ వర్గాలు, వారందర్ని బడా పెట్టుబడికి బంధిత రైతులుగా మార్చి, దాన్నే వ్యవసాయ కార్పోరేటీకరణ అనే అందమైన ముసుగును తగలించబోతున్నారు.

సరిగ్గా ఈ పరిస్థితులనే కోరుకొంటున్న ప్రభుత్వాలు- లక్షల రైతాంగపు వేదనలు, రోదనలను పెడచెవిన పెట్టటమే కాక వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యపరుస్తున్న దోపిడీ విధానాలనే కొనసాగించే కృతనిశ్చయంతో ఉన్నారు. వారు సృష్టించిన ఈ సంక్షోభాన్ని రెండవ హరిత విప్లవం అన్న ముద్దు పేరు మీదగా రైతాంగాన్ని నిలువు దోపిడీ సాగించుతూ సామ్రాజ్యవాదులు, బడా పెట్టుబడిదారులు వారి సాంఘిక పునాదైన బడా భూస్వామ్య ధనిక వర్గాల దోపిడీకి బంధిత రైతులుగా, సాలెగూట్లో శలభాల్లా మార్చే వైఖరినే ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి.

సరిగ్గా ఇక్కడే రైతాంగం ఏదో ఒకటి నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చింది. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, పాలకుల కబంధ హస్తాలలో పడి నలిగి దిగజారి నాశనం కావడమో లేదా ఎదిరించి మన వ్యవసాయాన్ని, రైతాంగాన్ని, మన ప్రజలకు కావల్సిన ఆహారభద్రతను అందించే విధంగా సాగే పోరాటంలో నిలబడటమో తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది. కార్మికవర్గ అండతో రైతాంగం తీసుకొనే దృఢ నిర్ణయమే భారత భవిష్యత్తును నిర్ణయించబోతున్నది.

ఈ సదస్సు నేటి సామ్రాజ్యవాద, మార్కెట్ దోపిడీ శక్తులకు, వారికి సాంఘిక పునాదిగా ఉన్న భూస్వామ్య దోపిడీ వర్గాల ఆధిపత్యాన్ని దెబ్బతీయాలని, భూమి పంపకం కేంద్రంగా వ్యవసాయక విప్లవ నినాదంలో ముందుకు సాగుతూ సామ్రాజ్యవాద, భూస్వామ్య శక్తుల కబంధ హస్తాల నుంచి దేశాన్ని, వ్యవసాయాన్ని కాపాడుకోవాలని పిలుపు ఇస్తున్నది.

## 7. భూ సేకరణ చట్టాన్ని రద్దు చేయాలి

1894 భూ సేకరణచట్టం మరింత ప్రమాదకరమైన లక్షణాలతో మార్పులు చేయబడి ముందుకు వస్తున్నది. ప్రజా ప్రయోజనం అన్న మోసపూరిత పదం మాటున దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం బలవంతంగా ప్రజల భూములు, నివాస స్థలాలు, నివాస ప్రాంతాల నుంచి గెంటివేసే చట్టం ఇది. ప్రభుత్వం సెజ్‌ల పేర, కారిడార్‌ల పేర, ఎక్స్‌ప్రెస్ హైవేల పేర, పరిశ్రమలు, గనులు, ప్రాజెక్టుల పేర అభివృద్ధి పేరుతో ప్రజలను గెంటి వేస్తున్నది. ఇప్పటికే లక్షలాదిమంది ప్రజలు వివిధ రూపాలలో నిరాశ్రయులై సొంత దేశంలోనే కాందిశీకులై పోయారు. ఇంతటి ప్రమాదకర భూసేకరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని సదస్సు డిమాండ్ చేస్తున్నది.

## 8. అణు విద్యుత్ కేంద్రాల గురించి

ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం మూర్ఖంగా తన అణు విద్యుత్ ఉత్పత్తి విధానాన్ని కొనసాగించదలచుకొంది. దీని కోసం అనేకమంది ప్రజలు, ప్రజాతంత్రవాదులు చేస్తున్న విజ్ఞప్తులను, ఆందోళనలను పెడచెవిన పెట్టి, ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక అంశాలన్నింటినోనూ సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లుతున్నది. అణువిద్యుత్ కేంద్ర నిర్వాసితులు తమ భూముల కోసం సాగిస్తున్న ఆందోళనలను క్రూరంగా అణచివేస్తున్నది. మరోప్రక్క ప్రపంచవ్యాపితంగా అణువిద్యుత్ ఉత్పత్తి సురక్షితమని నమ్మబలుకుతున్నది.

ఈ సదస్సు ప్రభుత్వ అణు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది. జైతాపూర్, కుడంక్కులం, రణస్థలి, ఇంకా అనేక ప్రాంతాలలో అణువిద్యుత్ కేంద్ర నిర్వాసితులు తమ భూముల, జీవన విధాన రక్షణ కోసం సాగిస్తున్న ఆందోళనలకు సదస్సు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నది.

## 9. అభివృద్ధి పేరిట గెంటివేతలకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలకు సంఘీభావంగా

ఈ సదస్సు ధర్మల్ విద్యుత్ కేంద్రాలు, గనులు, సెజ్‌లు, హైవేల, పారిశ్రామిక కారిడార్‌ల పేరుతో ప్రజల, జనజీవితాల, జీవన విధానాల, విధ్వంసం సాగిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నది. ఆ విధంగా నిర్వాసితులౌతున్న ప్రజలు తమ జీవనాధారం కోసం, భూమి కోసం, మనుగడ కోసం, సాగిస్తున్న ఉద్యమాలపై ప్రభుత్వం అమలు చేస్తున్న పాశవిక నిర్బంధాన్ని ఖండిస్తున్నది. సోంపేట, నోడియా, కాకరాపల్లి, పోస్కో, నియాంగిరి తదితర ప్రాంతాల ప్రజల ఆందోళనకు సదస్సు సంఘీభావం ప్రకటిస్తున్నది.

## 10. రిటైల్ రంగలో ఎఫ్.డి.ఐ.ని వ్యతిరేకిస్తూ

రిటైల్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించి బహుళజాతి తోడేళ్ళకి రిటైల్ రంగాన్ని అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయం 4 కోట్లమంది స్వయం ఉపాధి రంగంలోని దేశీయ చిన్నవ్యాపారులను సర్వనాశనం చేసేందుకే దారితీస్తుంది. ప్రజల నిరసనలకు తాత్కాలికంగా తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్న కేంద్ర ప్రభుత్వం, తన నిర్ణయాన్ని అమలు చేయాలన్న నిర్ణయంలోనే ఉంది. ఈ చిన్న రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడిని ఏ మాత్రం అనుమతించరాదని డిమాండ్ చేస్తున్నది.

## 11. నిర్బంధ చట్టాలను రద్దు చేయాలి

కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ వున్న ప్రభుత్వాలు తమ పాలనను సాగించుకొనేందుకు నిర్బంధ యంత్రాంగంపై ఆధారపడుతున్నాయి. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేని పాలకులు వివిధ వర్గాల ప్రజలు పోరాట పంథాను చేపట్టినప్పుడల్లా పాశవిక నిర్బంధానికి పూను కుంటున్నారు. భూస్వాములు, బడా బూర్జువాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల రక్షణ కొరకు, పోరాడే కార్మికులను, వారు ఎగుమతి జోన్లలో పనిగంటల నిర్ధారణను కోరుతున్న మహిళా కార్మికులు కావచ్చు, పరాయీకరణ చెందిన భూముల కొరకు పోరాడే ఆదివాసులు కావచ్చు, అభివృద్ధి పేరిట గెంటివేయ బడుతున్న ప్రజలు కావచ్చు, పారకుడి వంటి కుల వివక్షత, అణిచివేతలను ఎదుర్కొనే దళితులు కావచ్చు, ప్రభుత్వం వారిని ఉక్కుపాదం మోపి అణిచివేస్తున్నది. తాము పవిత్రమనే రాజ్యాంగాన్ని, చట్ట పాలననూ కాలరాచి, లాకప్ మరణాలు, మాయం చెయ్యటం, బూటకపు ఎన్‌కౌంటర్లతో ప్రాథమిక హక్కులను నిరాకరించేందుకు కూడా వారు వెనకాడటం లేదు. టెర్రరిజంపై పోరు సాకుతో మైనారిటీ మతస్తులను అవమానాలకు, వేధింపులకు గురిచేస్తున్నది. వివిధ జాతులు, ప్రత్యేకించి కాశ్మీరు, ఈశాన్య రాష్ట్రాల జాతుల ఆకాంక్షలను అణచివేస్తున్నది.

వివిధ వర్గాల ప్రజలపై సాగిస్తున్న ఈ పాశవిక నిర్బంధకాండను నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలుగా ఈ సదస్సు ఖండిస్తున్నది. చట్టబద్ధపాలనను పాటించమని కోరుతున్నది. సైనికదళాల ప్రత్యేక అధికారాల చట్టం, నాసా, పోటా వంటి అన్ని నిర్బంధ చట్టాలను రద్దు చేయాలని డిమాండు చేస్తున్నది.

## 12. దళితులపై దాడులు

దళితుల సాధికారత గురించి పాలకులు పెద్ద పెద్ద మాటలు చెపుతున్న సమయంలోనే దేశవ్యాపితంగా దళితులపై దాడులు, అత్యాచారాల సంఘటనల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. తమిళనాడు నుండి హర్యానా వరకూ గుజరాత్ నుండి బీహార్ వరకూ గ్రామీణ భారత దళిత ప్రజానీకం అణచివేత పీడనలను, అగ్రకుల భూస్వామ్య వర్గాల నుండి ఎదుర్కొంటూనే ఉన్నారు. చివరకు పాలకులు 'అభివృద్ధి' అనేది సైతం కుల అణచివేతలను, వివక్షతలను బలీయం చేస్తున్నది. ఈ సదస్సు దళితులపై అణచివేత, పీడనలను తీవ్రంగా ఖండిస్తున్నది.

## 13. మారుతీ సుజుకీ యాజమాన్య నిరంకుశ చర్యలను ఖండిస్తూ

మారుతీ సుజుకీ యాజమాన్యం అత్యంత క్రూరంగా, అనైతికంగా, దుర్మార్గంగా కార్మికులపైనా, కార్మికుల యూనియన్ హక్కులపైనా దాడికి దిగింది. మానేసర్‌లోని ప్లాంట్‌లో కార్మికులు "సత్ప్రవర్తన వాగ్మూలం" ఇస్తేనే పనిలోకి రావాలని షరతు విధించింది. ఈ రకమైన వేధింపులు సరికాదని హర్యానా ప్రభుత్వ కార్మికశాఖ కార్యదర్శి ప్రకటించినా, కేంద్ర కార్మిక మంత్రి సైతం అలాంటి సత్ప్రవర్తన వాగ్మూలం అన్నది అమానుషం అని పేర్కొన్నా యాజమాన్యం చలించలేదు. దీనికి గల కారణమేమంటే కేంద్ర, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఈ విషయంలో జోక్యం చేసుకోబోమని ప్రకటించడం ద్వారా పరోక్షంగా యాజమాన్యానికే కొమ్ముకాశాయి. కార్మికులు ఆందోళన సాగించాల్సిన పరిస్థితిని కల్పించారు.

మారుతీ సుజుకీ యాజమాన్య వైఖరి కార్మిక హక్కులు ముఖ్యంగా యూనియన్ నిర్మాణ హక్కు పట్ల యాజమాన్యాల తీవ్ర వ్యతిరేక వైఖరిని తెలియచేస్తుంది. ఈ ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత సదస్సు కార్మికుల విషయంలో ప్రభుత్వ నీచ పాత్రను ఖండిస్తున్నది. కార్మికులను తీవ్ర వేధింపులకు గురిచేసిన మారుతీ సుజుకీ యాజమాన్యంపై తీవ్ర చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నది.

## 14. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల గురించి

పారిశ్రామిక రంగంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం, ప్రవేశపెట్టడంతో చట్ట ప్రకారం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులంతా కార్మిక హక్కుల నుంచి సంక్షేమం, రక్షణల నుంచి పూర్తిగా మినహాయించబడ్డారు. బడా పెట్టుబడి చేతిలో దారుణమైన దోపిడీకి గురౌతున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌ల విధానం పేర 90 శాతం మంది కార్మికులు ఎలాంటి రక్షణ లేక కట్టు బానిసల స్థాయికి దిగజారారు. కనుక ఈ అఖిల భారత సదస్సు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం చట్టవిరుద్ధమని ప్రకటించి వానిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది.

## 15. మహిళా కార్మికుల సమస్యలపై

వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళా కార్మికులు నేటికీ అమానవీయ దోపిడీకి, వివక్షతకు గురౌతూనే ఉన్నారు. సమాన పనికి సమాన వేతనమన్నది మహిళా కార్మికుల విషయంలో నేటికీ వర్తించడం లేదు. ఈ సదస్సు ఈ అమానవీయ దోపిడీ, వివక్షతలను ఖండిస్తూ సమానమైన పనికి సమానమైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది.

## 16. కార్మికుల పొదుపు మొత్తాల రక్షణ గురించి

కార్మికుల కష్టార్జితం నుంచి పోగుపడిన ఇ.పి.ఎఫ్, పెన్షన్ నిధులపై పారిశ్రామిక సంస్థల, వాణిజ్య వర్గాల వక్రదృష్టి పడింది. ఈ నిధులన్నింటినీ చట్టా వ్యాపారంలో (స్పెక్యులేటర్) పెట్టి వాటినన్నింటినీ కాజేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాయి. ఈ నిధులకు రక్షణగా ఉండాల్సిన ప్రభుత్వం కూడా వీటిని స్పెక్యులేటివ్ వ్యాపారి దోపిడీకి అనువుగా అప్పగించడానికి పి.ఎఫ్.ఆర్.డి.ఎ ను పార్లమెంట్‌లో బిల్లుగా ప్రవేశపెట్టడమే కాక ఇ.పి.ఎఫ్ మీద కార్మికులకు వచ్చే వడ్డీలో 1.25% కోత విధించి 9.50% నుంచి 8.25% తగ్గించింది. ఆ సదస్సు ప్రభుత్వ ఈ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తూ కార్మికుల కష్టార్జితమైన ఈ నిధులకి, రక్షణగా కాక బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ నిధులను మళ్లించే పథకాలను వ్యతిరేకిస్తున్నది. పి.ఎఫ్.డి.ఆర్.ఏ బిల్లును వెంటనే ఉపసంహరించాలని, పిఎఫ్ వడ్డీ మీద కోత విధించాలన్న ఉద్దేశాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నది.

## 17. కార్మికుల పారిశ్రామిక భద్రతపై

నూతన ఆర్థిక విధానాల అమలుతో పని పరిస్థితులలో కార్మికుల భద్రత మరింత దిగజారి పోయింది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు కార్మిక భద్రత, నష్ట పరిహార విధానాల నుంచి అత్యధిక భాగం తప్పించబడ్డారు. వీటి ఫలితంగా పారిశ్రామిక ప్రమాదాల సంఖ్య, కార్మిక భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. కార్మిక ఉద్యమం ఈ పరిణామాలపై అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ సదస్సు అన్ని రకాల పని పరిస్థితులలో కార్మికులకు పూర్తి భద్రతా ప్రమాణాల ఏర్పాటుకి బాధ్యత వహించి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నది. అదే సమయంలో కార్మికులందరూ పని ప్రాంతాలలో పూర్తి భద్రత, ప్రమాదాల నుంచి సంపూర్ణ రక్షణ, ప్రమాదాల ఫలితాల నుంచి సంపూర్ణమైన నష్టపరిహారం అన్ని రంగాల కార్మికులందరికీ లభించేలా పోరాడేందుకు పూనుకోవాలని పిలుపు ఇస్తున్నది.

## 18. బాల కార్మికుల శ్రమదోపిడీని ఖండిస్తూ

65 సంవత్సరాల స్వతంత్ర పాలన అని చెప్పబడుతున్న భారతదేశంలో నేటికీ బాల కార్మికుల సమస్య అత్యంత విషయంగానూ రోజు రోజుకీ పెరిగి పోతూ వస్తున్నది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 50 లక్షలమంది బాల కార్మికులున్నట్లు చెబుతున్న ఈ సంఖ్య ఇంకా ఎక్కువేనని తెలుస్తోంది. పెరిగిపోతున్న బాల కార్మిక వ్యవస్థ అన్నది ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల ఫలితమూ, రోజు రోజుకీ పెరిగిపోతున్న పేదరికానికి నిదర్శనమూ. ప్రభుత్వాలు చెపుతున్న బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా నిధులు, చర్యలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఏ మాత్రం దోహదపడలేదు.

ఈ అఖిల భారత సదస్సు బాల కార్మిక వ్యవస్థ యొక్క తీవ్రతను అర్థం చేసుకొంటూ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పూనుకోవాలని డిమాండ్ చేస్తున్నది.

## 19. ఇంటి పనివారల సమస్యలపై

మన దేశంలో ఇళ్ళలో పనిచేసే పనివారల సమస్య దయనీయంగా ఉంది. భారతదేశం ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ కార్మిక సంస్థలో సభ్య దేశంగా గృహ సంబంధ మహిళా కార్మికుల సమస్యలపై అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్ణయాలను, తీర్మానాలను ఏనాడూ చిత్తశుద్ధితో అమలు చేయ పూనుకోలేదు. 1990ల నుండి నూతన ఆర్థిక విధానాల అమలు క్రమంలో గృహ సంబంధ కార్మిక కార్యకలాపాలు 200 శాతం పెరిగి ఒక పరిశ్రమ స్థాయికి చేరాయి. అయినా గృహ సంబంధ మహిళా కార్మికుల వేదనలు తీరనేలేదు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత సదస్సు గృహ సంబంధ మహిళా కార్మికుల జీవన, పని పరిస్థితులు మెరుగుపడాలని భారత ప్రభుత్వం వీటిపై ఐ.ఎల్.ఓ కన్వెన్షన్ తీర్మానాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నది.

## 20. ప్రభుత్వ ఉపాధి ఉత్పాదక విధానంపై

సామ్రాజ్యవాదులు, బడా పెట్టుబడిదారుల సేవకి తమ్ము తాము అంకితం చేస్తున్న ప్రభుత్వాలు 'గ్రాండ్ పాలసీ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్' పేరిట ముందుకు వచ్చాయి. దీనిని బట్టి దేశంలో వివిధ ప్రాంతాలను జాతీయ పారిశ్రామిక వాడలుగా ప్రకటించి ఏ హక్కులు, రక్షణలు లేని కట్టుబానిసల స్థాయికి కార్మికులను దిగజార్చి పనులు చేయించి మరింత తీవ్రమైన దోపిడీకి గురిచేస్తారు. ఈ రకపు పారిశ్రామిక పార్కులు, కారిడార్‌లు, వాడల ఫలితంగా కార్మికుల ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వాలు నమ్మబలుకుతున్నాయి. అయితే వాస్తవాలు మరో విధంగా దీనికి విరుద్ధంగా ఉన్నాయి. 2004 నుంచి 2009 వరకూ దేశ ఆర్థిక ఉత్పత్తి సూచి 8.43% వార్షిక అభివృద్ధిని సూచిస్తుంటే కేవలం 20 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించబడ్డాయి. కానీ ప్రభుత్వం 2007-10 మధ్య 5 కోట్ల 80 లక్షల ఉద్యోగాలు కల్పించబడతాయని చెప్పింది. ఇప్పుడు అదే ప్రభుత్వం ఆర్థిక ప్రగతి మందగించుతున్నది కనుక 2012కి 20 లక్షల ఉద్యోగాలు సైతం కల్పించే పరిస్థితి లేదు. జాతీయ సాంపిల్ సర్వే 2009-10 నివేదిక ప్రకారం ఉద్యోగ కల్పనా సూచి ఏ ఏటికాయేడు దిగజారితూనే ఉందని తెలుస్తోంది. కల్పించబడిన ఉద్యోగాలు కూడా తగిన ప్రమాణాలతో కూడినవి కాక కాంట్రాక్టు, టెంపరరీ కార్మికులేనని గమనించాలి.

కనుక ప్రభుత్వం నూతనంగా ప్రకటిస్తున్న 'ఉత్పాదక విధానం' ఉద్యోగ ఉపాధి కల్పనను ఏ మాత్రం పెంచదని, నాణ్యమైన జీవన ప్రమాణాల ఉద్యోగ ఉపాధి కల్పన అన్నది నిస్సందేహంగా అసాధ్యమని స్పష్టమౌతున్నది.

ఈ అఖిల భారత సదస్సు కార్మికులపై ప్రభుత్వ మాన్యు ఫాక్చరింగ్ పాలసీ యొక్క దుష్ప్రభావాలను గమనిస్తూ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక ఉత్పాదక విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

## 21. మానవ పారిశుద్ధ్యం

65 సంవత్సరాల స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనగా చెప్పబడుతున్నా నేటికీ కూడా మానవ మలమూత్రాలను మనుషులే శుభ్రం చేసే అమానవీయ, హేయమైన విధానం ప్రభుత్వ సంస్థలు, భారతీయ రైల్వేలతో సహా అమలు జరుగుతూనే ఉంది. యస్.సి., యస్.టి అత్యాచార నిరోధక చట్టం (1989) కానీ, సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులుగానీ, చివరకు సోనియా గాంధీ నేతృత్వంలోని జాతీయ సలహా మండలి రాష్ట్రాలకి ఇచ్చిన సూచనను - మనుషులచే పారిశుధ్య పనులు చేయించడం 'శిక్షార్హమైన నేరం'గా ప్రకటించాలని చెప్పినవి-ఏవీ ఈ పారిశుధ్య కార్మికులవట్ల అమానుషత్వాన్ని ఏ మాత్రం మార్చలేకపోయాయి.

నిజానికి ఈ అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా అణగదొక్క బడుతున్న కులాల, (భంగీ) తెగల ప్రజల చేత చేయించబడుతున్న ఈ అమానవీయ పనుల పట్ల మొసలి కన్నీరు కార్చడానికే పాలకులకు పనికి వస్తాయి కానీ మౌలికంగా మార్పు.

తీవ్రమైన ఆవేదనతో ఈ సదస్సు, భయానకమైన, అమానవీయమైన మానవ పారిశుద్ధ్యం పద్ధతులను ఖండిస్తున్నది. ప్రభుత్వం వెంటనే మనుషుల చేత మానవ మల పారిశుద్ధ్యం చేయించే పద్ధతులను నిషేధించాలని ఆ సమూహాలకు గౌరవప్రదమైన, ప్రత్యామ్నాయ జీవన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నది.

## 22. అధిక ధరల సమస్యపై

దేశంలో అంతులేకుండా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలక వర్గాలే కారణమని ఏఐఎఫ్‌టియు (న్యూ) ప్రకటిస్తున్నది. బడా పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపారులు, ఆర్థిక-వాణిజ్య రంగాల్లో సట్టా వ్యాపారం చేసే వారు, ప్రభుత్వం యొక్క ప్రత్యక్ష తోడ్పాటుతో మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టిస్తూ నిత్యావసరాల ధరలను, సేవా సౌకర్యాల ధరలను పెంచివేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సరుకులన్నింటినీ అత్యధిక లాభాలకు ఎగుమతి చేయటమనేది దేశంలో ధరల పెరుగుదలకు మరో కారణమౌతున్నది. ఆహార పదార్థాలను, అత్యవసర సరుకులను అక్రమనిల్వ చేయటమనేది అధిక ధరలకు ఇంకో కారణంగా వుంది. సాధారణ పేద ప్రజానీకం నిత్యావసరాలకు అధిక ధరలు చెల్లించవలసిరావటం మరో తరహా దోపిడీ, లూటీ మినహా వేరుకాదు. ఏఐఎఫ్‌టియు(న్యూ) సదస్సు ఈ దోపిడీని తీవ్రంగా ఖండిస్తూ దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిస్తున్నది.

## 23. పర్యావరణం, జీవావరణాల విధ్వంసాన్ని ఖండిస్తూ

ప్రపంచవ్యాపితంగానూ, భారతదేశంలోనూ, ఇంకా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ బహుళజాతి సంస్థలతోను బడా పారిశ్రామికవేత్తలతోనూ చేతులు కలిపిన స్థానిక ప్రభుత్వాలు పర్యావరణం, జీవావరణాలకు తీవ్ర విఘాతాన్ని కలిగించటాన్ని ఏఐఎఫ్‌టియు (న్యూ) సదస్సు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ పరిణామాల ఫలితంగానే బీభత్సమైన వరదలు ఒకవైపున, తీవ్రమైన కరవులు మరోవైపున సంభవిస్తూ లక్షలాదిమంది ప్రజల జీవనాధారాన్ని, వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నాయి. జీవావరణం, పర్యావరణాల పరిరక్షణలకోసం పోరాడ వలసిందిగా ఏఐఎఫ్‌టియు(న్యూ) సదస్సు తీర్మానిస్తున్నది.

D

## మతకలహాలు.... (2వ పేజీ తరువాయి)

మున్నెన్నడూ మత హింస నెరుగదు. హిందు-ముస్లిములు శాంతి, స్నేహభావంతో నివసించేవారు. మియో ముస్లిములు సాంస్కృతికంగా అర్ధ హిందువులుగా పరిగణించబడతారు. వారిలో చాలామంది పేర్లు హిందూ మతానికి చెందినవే. వారిలో అనేక మంది హిందూ పండుగలను చేసుకుంటారు. ముస్లిములు ప్రధాన స్రవంతిలో భాగం కాదని బిజెపి తరచూ ప్రకటిస్తూ మత ఉద్రిక్తతలను ఆరకుండా ఆజ్యం పోస్తూ వస్తున్నది.

బిజెపి పాలిత రాష్ట్రమైన ఉత్తర ఖండ్‌లోని రుద్రపూర్ ప్రాంతంలో మరో మత కొట్లాట చోటు చేసుకుంది. రుద్రపూర్‌కు కూడా మత ఘర్షణల చరిత్ర వుంది. రుద్రపూర్‌లో ఈసారి కూడా మత ఉద్రిక్తతలను రగిలించినట్లు స్పష్టంగా అర్థమౌతుంది. మతఘర్షణలు చోటు చేసుకునేందుకు ఏ తాత్కాలిక ఉద్రిక్తతా లేదు. రెండు ప్రయత్నాలు జరిగాయి. ఒక ప్రయత్నం విఫలమైంది. రెండో ఘటనలో ఉద్రిక్తతలు మతతత్వ వాదులు ఆశించిన విధంగా రగిలాయి.

సెప్టెంబరు 28 రాత్రి జరిగిన మొదటి ఘటనలో కొందరు దుండగులు ఖురాన్‌ను ఎరుపురంగు వస్త్రంలో చుట్టి రక్తంలో ముంచి లేపనట్టుగా-శని దేవాలయం ఎదుట వుంచారు. 29 ఉదయం భక్తులు దీనిని చూసి ఆగ్రహించారు. దీనిపై ఉద్రిక్తత కలిగినా పోలీసులు నియంత్రించారు.

అక్టోబరు 2వ తేదీ గాంధీజయంతినాడు జరిగిన రెండవ ప్రయత్నంలో ఆకుపచ్చ పాలిథీన్ కవరులో అరబిక్ భాషలో రాసిన కొన్ని పేజీలను వుంచి, వీటికి కొన్ని మాంసపు ముక్కలను జోడించి అదే దేవాలయం దగ్గర తిరిగి వుంచారు. మొదట 150 మంది ముస్లిములు ఆపై 800 మంది వరకు పోగైన పిదప పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘర్షణల్లో 38 మంది పోలీసులు గాయపడ్డారు. మరో వైపునుండి హిందువుల గుంపు దూసుకురావటంతో పరిస్థితి మరింత అదుపు తప్పింది.

పోలీసుల లెక్కల ప్రకారం 30 మంది పౌరులు గాయపడగా 100 వాహనాలు తగులబెట్టబడ్డాయి. ఢిల్లీ-నైనిటాల్ జాతీయ రహదారి అంతా దగ్ధం కాబడిన వాహనాలతో నిండిపోయింది. 100కు పై దుకాణాలు లూటీ చేయబడ్డాయి. ఎఫ్ఐఆర్‌లో 37 మందిలో 24 మందిని అరెస్టు చేశారు. సెప్టెంబరు 29 నాటికి జిల్లా యంత్రాంగం పూనుకొని వ్యవహరించకపోతే పరిస్థితి మరింత దారుణంగా పరిణమించేది.

2011లో జరిగిన మత వరవైన దాడులు-కలహాలకు-చెందిన వివరాలివి. ఇవన్నీ చాలా అల్పమైన కారణాలతో సంభవించాయని విదితమౌతున్నది. నిరంతరాయ మతతత్వ ప్రచార ఫలితంగానే అల్పమైన కారణాలకూ ఇంతటి ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయనేది గమనించవచ్చు. అదేవిధంగా అధికార, పోలీసు యంత్రాంగం కూడా ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా వ్యవహరించటంలోనూ, హింసను ప్రోత్సహిస్తున్న దుండగుల పక్షాన నిలవటంలోనూ తోడ్పడుతున్నది. అంతేగాక పేదరికం, నిరుద్యోగం వంటి అంశాలన్నీ ఇలాంటి దాడుల సందర్భంగా పెద్ద సంఖ్యలో జనం పోగుబడటానికి కారణమౌతున్నది.

ఈ అంశాలన్నింటినీ పరిష్కరించకుంటే మతపరమైన శాంతిని నెలకొల్పటం చాలాకష్టం

(డా॥ అస్గర్ ఆలీ ఇంజనీర్, 'కమ్యూనల్ రయిట్స్-2011'వ్యాసం ఆధారంగా)

D

### గమనిక

5-1-2012 'జనశక్తి' సంచికలో ప్రచురింపబడిన పుష్పా ఎం. భార్గవ వ్యాసం-2011 డిసెంబర్ 28 'ది హిందూ' పత్రిక నుండి గ్రహింపబడిన ఆంగ్లవ్యాసానికి తెలుగు అనువాదం

# అడవిపై తమ హక్కులను హరిస్తున్నపాలకులపై పోరుబాటలో గిరిజనులు

**నాగరిక** ప్రపంచానికి దూరంగా తరతరాలుగా కొండ కోనల్లో నివశిస్తున్న గిరిజనులు శతాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి, భూస్వాముల, గిరిజనేతర పెత్తందారుల, పరిశ్రమాధిపతుల, బహుళజాతి సంస్థల దోపిడీకి గురౌతూనే ఉన్నారు. తాము పుట్టి పెరిగిన అడవిపైన, భూములపైన, అటవీ సంపదలపైన హక్కును కోల్పోతూ, దారుణమైన హీనాతిహీనమైన జీవితాలు గడుపుతున్నారు.

ఆదివాసీ ప్రజలు ఇతరుల అధికారాన్ని, ఆధిపత్యాన్ని ఎప్పుడూ అంగీకరించలేదు. రాజరిక వ్యవస్థలోనూ వీరు స్వతంత్ర జీవితాన్ని గడిపారు. అడవిపై పూర్తి అధికారాన్ని కలిగి ఉన్నారు. సమష్టి జీవన విధానాన్ని కొనసాగించారు. తమ హక్కులను హరించే వారిపై తిరుగుబాట్లు చేశారు.

## వలస పాలనా కాలంలో గిరిజన చట్టాలు

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు దేశాన్ని వలసగా మార్చుకొన్న తర్వాత అడవిపై గిరిజనుల హక్కును హరించారు. గిరిజనుల జీవితాలను ఛిన్నాభిన్నం చేశారు. దేశంలోని సంపదలతోపాటు అటవీ సంపదలను కొల్లగొట్టేందుకు, గిరిజనులపై అణచివేత సాగించి, అడవులపై నియంత్రణ ప్రారంభించారు. 1805 సం॥ నుండి వారి దేశ అవసరాల కోసం పెద్ద ఎత్తున కలపను తరలించుకొనిపోవటమే కాకుండా భారతదేశంలో నిర్మించిన రైల్వే లైన్లకు కూడా అటవీ కలపను విచ్చలవిడిగా ఉపయోగించారు. అడవిపై నిరంకుశాధికారం కోసం అనేక చట్టాలు చేశారు.

1855లో భారత గవర్నర్ జనరల్‌గా ఉన్న డల్‌హౌసీ మొదటిసారిగా అటవీ విధానాన్ని ప్రకటించి అటవీ సంపదలన్నీ ప్రభుత్వ ఆస్తిగా అధికారికంగా ప్రకటించారు. తమ అవసరాలకు గిరిజనులు ఉపయోగించే కలపపై ఆంక్షలు విధించాడు. ఆ విధంగా అడవిపై గిరిజనుల హక్కును తొలగించే విధానాలకు శ్రీకారం చుట్టారు. 1864లో అటవీ ఇన్‌స్పెక్టర్ జనరల్ నియామకంతో అడవులపైన, ఆదివాసీ ప్రజలపైన బ్రిటీష్ ప్రభుత్వ పెత్తనం ప్రారంభమైంది. 1865లో మొట్టమొదటి అటవీ చట్టాన్ని చేయటం ద్వారా అడవులను పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకోవటానికి బ్రిటీష్ ప్రభుత్వం అవకాశం కల్పించుకొంది. 1878లో అడవులపై గిరిజన గ్రామాలకు గల సాంప్రదాయ హక్కులపై ఆంక్షలు విధిస్తూ చట్టంలో మార్పులు చేయటం ద్వారా బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమ అధికారాన్ని విస్తృతపర్చుకొన్నారు. 1894లో చేసిన అటవీ విధాన ప్రకటన అడవులపై బ్రిటీష్ ప్రభుత్వం పట్టును మరింత పెంచింది. సామాజిక, ప్రైవేటు అడవులతో సహా దేనినైనా బలవంతంగా స్వాధీనం చేసుకొనే అధికారాన్ని ఈ చట్టం ద్వారా పొందింది. అడవులలోనూ, దాని చుట్టుప్రక్కలా నివాసముండే ప్రజలు తమ స్వంత అవసరాలకు మాత్రమే అడవులను ఉపయోగించుకొనేందుకు పరిమితం చేసింది. ఈ విధంగా అడవిపై వారి హక్కును హరించి గిరిజనుల జీవితాలను అల్లకల్లోలం చేసింది. దీని తర్వాత 1927లో బ్రిటీష్ ప్రభుత్వం భారత అటవీ చట్టం చేసింది. దీనితో అడవి నుండి మరింతగా ఆదివాసీలు దూరమయ్యారు. ఈ చట్టంద్వారా అడవులను-రిజర్వు, సంరక్షిత, సామాజిక అడవులుగా విభజించి వాటిల్లోకి ఎవరూ వెళ్ళరాదని నిషేధాజ్ఞలు విధించింది. దీన్ని ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించే అధికారం అటవీ అధికారులకు ఇవ్వటంతో గిరిజనులు వారి దోపిడీకీ, అణచివేతకీ గురయ్యారు. ఈ విధంగా బ్రిటీష్ సామ్రాజ్య వాదులు గిరిజన వ్యతిరేక చట్టాలు అనేకం చేశారు.

## అధికార మార్పిడి అనంతరం గిరిజన చట్టాలు

బ్రిటీష్ వలస పాలకుల నుండి అధికారాన్ని మార్పిడి చేసుకొన్న భారత దళారీ పాలకులు అన్ని రంగాల్లో వారి విధానాలనే కొనసాగించారు. గిరిజనులను అడవి నుండి తొలగించే మరిన్ని చట్టాలను చేశారు. 1952లో పకడ్బందీగా భారత అటవీ విధానాన్ని పాలకులు ప్రకటించారు. ఈ విధానం ప్రకారం రిజర్వు, రక్షిత, గ్రామ అడవులుగా అటవీ ప్రాంతాన్ని వర్గీకరించారు. గిరిజనులు తమ అవసరాలను గ్రామ అడవుల నుండే తీర్చుకోవాలి. రిజర్వు అడవుల్లోకి ప్రవేశించటం నేరం. 1894 అటవీ విధానం ప్రజల అవసరాలను తీర్చటానికి రిజర్వు అడవుల అంచులలోని ప్రాంతాలను వదిలిపెట్టింది. అలాగే కొన్ని నిబంధనలతో అటవీ భూములలో వ్యవసాయానికి అవకాశం కల్పించింది. 1952 అటవీ విధానం, దీన్ని సైతం రద్దు చేసింది. 1952 భారత అటవీ విధానం ప్రకారం ప్రజల అవసరాలు గ్రామ అడవుల నుండే తీర్చుకోవాలి. రిజర్వు అడవిని ముట్టుకోరాదు. 1894 విధానంలో ఇది స్వంత అడవులకు వర్తించకపోగా, 1952 అటవీ విధానం సొంత అడవులకు కూడా వర్తింపచేసింది. 1894 అటవీ విధానం అడవులలో పశువులను మేపుకోవటాన్ని నిషేధించలేదు. 1952 అటవీ విధానం పశువులను మేపటాన్ని నియంత్రించి సుంకాన్ని విధించింది. అడవుల నుండి వంట చెరకుగాను, గృహ అవసరాలకు, పనిముట్ల తయారీకి అవసరమైన కలప తెచ్చుకోవటం, వ్యవసాయానికి అవసరమైన నీటిని మళ్ళించటానికి, అటవీ ఉత్పత్తులు సేకరించటానికి, ఇళ్ళు కట్టుకోవటానికి అవసరమైన రాళ్ళు, మట్టి తెచ్చుకోవటాన్ని 1894 అటవీ విధానం గిరిజనుల హక్కుగా గుర్తించగా, 1952 విధానం వాటినన్నీ మినహాయించింది.

1952 భారత పాలకుల అటవీ విధానం గిరిజనుల కాళ్ళకు బంధాలు వేసింది. పరిమిత ప్రాంతంలోనే బందీలను చేసింది. ఆ విధంగా అడవిలో తిరిగే స్వేచ్ఛను హరించింది. రిజర్వు ఫారెస్టుల్లో గిరిజనులు కాలు పెట్టినా, పశువులు వెళ్ళినా అటవీ అధికారులు జరిమానాలతో, కేసులతో గిరిజనులను భయభ్రాంతులను చేసేవారు. దీన్ని గమనిస్తే వలస పాలకులు తెచ్చిన 1894 అటవీ విధానం కన్నా, భారత పాలకులు తెచ్చిన అటవీ విధానం గిరిజనుల హక్కులను నిరంకుశంగా అణచివేయటానికి పూనుకొన్నదేనని స్పష్టమౌతున్నది.

1952 నాటి కన్నా నిరంకుశమైన అటవీ చట్టాన్ని 1980లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. అటవీ భూములను, ఇతర అవసరాల నిమిత్తం వినియోగించటాన్ని, మార్పిడి చేయటాన్ని నిషేధించింది. ఈ చట్టం క్రింద అటవీ ప్రాంతంలో నివశిస్తున్న గిరిజనులను అక్కడి నుండి ఖాళీ చేయించేందుకు పూనుకొంది. అడవులలో వ్యవసాయాన్ని నిషేధించింది. ఈ విధంగా గిరిజనులను అడవి నుండి దూరం చేయటానికి పూనుకుంది. గిరిజనోద్యమం ఫలితంగా 1980సం॥కు పూర్వం నుంచి అడవులలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులను ఆ ప్రాంతాల నుండి ఖాళీ చేయించకుండా 1987లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు యిచ్చింది.

## భూపరాయీకరణ

అడవిపై గిరిజనుల హక్కులు హరించటం ప్రారంభమైన తర్వాత గిరిజనుల భూములు పరాయీకరణ చెందాయి. గిరిజనేతర సంపన్న వర్గాలు గిరిజన ప్రాంతాల్లోకి పెద్ద ఎత్తున చొరబడి, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వారి భూములను కాజేశారు. బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో భూముల సర్వే అండ్ సెటిల్‌మెంట్ చేపట్టిన సమయంలో చాలా ప్రాంతాల్లో గిరిజనులు సాగుచేసుకొంటున్న భూములపై వారికి గల హక్కులు నమోదు చేయటం జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో గిరిజనుల భూములను గిరిజనేతరుల పేరిట వ్రాయించుకోవటం జరిగింది. సేవాయి జమాబంది విధానంలో వ్యవసాయం చేసుకొంటున్న గిరిజనులు పట్టా హక్కుల ప్రాముఖ్యత తెలియక వాటిని పొందలేక పోయారు. అదే విధంగా అటవీ సరిహద్దులు నిర్ణయించినప్పుడు పోడు వ్యవసాయదారులకు పోడు భూములపై హక్కుల ప్రాముఖ్యత తెలియలేదు. వారి నిరక్షరాస్యత కారణంగా అనేకమంది గిరిజనులు సర్వే అండ్ సెటిల్‌మెంట్ సమయంలో తమ కివ్వబడిన పట్టాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేక భూములు కోల్పోవటం జరిగింది.

తెలంగాణా గిరిజన ప్రాంతంలో నిజాం ప్రభుత్వం పన్నుల ద్వారా అధిక ఆదాయం పొందటానికి గిరిజనేతర వలసలను ప్రోత్సహించింది. వారికి భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు యిచ్చింది. దీంతో 1920-30 మధ్య కాలంలో గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల సంఖ్య పెరిగింది. పోడు వ్యవసాయం కోసం భూమిని వదిలి మరొక చోటకి వెళ్ళిన వారివి, పన్నులు కట్టలేక భూమిని వదిలివెళ్ళిన వారి భూములు గిరిజనేతరులకు ఇవ్వబడ్డాయి. ప్రభుత్వ భూములను గిరిజనేతరులకు కేటాయించటానికి అధికారులకు హక్కు యిచ్చారు.

గిరిజన భూములు అన్యాక్రాంతం కావటం, ముఖ్యంగా గిరిజనేతరులు పెద్ద సంఖ్యలో గిరిజన ప్రాంతాల్లోకి వెళ్ళటం వల్లనే జరిగింది. వీరిలో వ్యాపార రీత్యా వచ్చినవారు అమాయక గిరిజనులకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి మోసపూరితంగా వారి భూములను ఆక్రమించారు. ఈ విధంగా ప్రభుత్వ విధానాలు, గిరిజనేతర పెత్తందారుల దోపిడీ వలన గిరిజన భూములు అన్యాక్రాంతమైనాయి.

## గిరిజన పోరాటాలు

గిరిజనుల స్వతంత్ర జీవనాన్ని విచ్ఛిన్నం చేసే బ్రిటీష్ వలస పాలకుల చర్యలను గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకించారు. బ్రిటీష్ రాజ్య విస్తరణకు, వారికి తాబేదార్లుగా ఉన్న జమీందార్లకు, స్థానిక పరిపాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. బీహార్, బెంగాల్ ప్రాంతాల్లో జరిగిన కోల్ తిరుగుబాటు (1830), సంతాల్ తిరుగుబాటు (1855-56) బ్రిటీష్ వారు నియమించిన జమీందార్లకు, వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా కేంద్రీకృతమైనాయి. సిద్దుముర్ముల నాయకత్వంలో (1855) సంతాల్ ప్రాంతాలను వదిలిపొమ్మని గిరిజనేతరులకు హెచ్చరికలు జారీ చేశారు. వీరి ఉద్యమం తీవ్రరూపం దాల్చిన తరుణంలో కనపడ్డ తెల్లవాళ్ళ నందరిని హతమార్చారు. క్రూరమైన దాడులతో బ్రిటీష్ సైన్యం వీరి పోరాటాన్ని అణచివేసింది. కారల్‌మార్క్స్ భారతదేశ చరిత్రపై రాసిన దానిలో ఏడు నెలల గెరిల్లా యుద్ధంగా సంతాల్ తిరుగుబాటుని వర్ణించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనోద్యమాలు

దేశ వ్యాపితంగా జరిగిన గిరిజన తిరుగుబాట్లలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ అనేక తిరుగుబాట్లు జరిగాయి. రాంభూపతి నాయకత్వంలో 1802-03 సం॥లో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన తిరుగుబాటు రంప పితూరిగా పేరుగాంచింది. ఈ తిరుగుబాటులో బైసన్ కొండ ప్రాంత రెడ్లు పాల్గొన్నారు. భూమిశిస్తు, ఇతర పన్నుల పెంపుదలకు, కల్లుగీతపై విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం జరిగింది. విశాఖపట్నం జిల్లాలోని కాశీపురం, పాయకరావుపేట, పాలకొండ, గంజాం జిల్లాలోని పర్లా కిమిడి ప్రాంతాలలో 1832 సం॥లో గిరిజన ఆందోళనలు తలెత్తాయి. తమ్మన్నదొర నాయకత్వంలో 1879 సం॥లో రంప ప్రాంతంలో మరోసారి జరిగిన పితూరి భద్రాచలం నుండి గోలుగొండ వరకు విస్తరించింది. ముఠాదారులు నాయకత్వం వహించిన ఈ పితూరిని ఈస్ట్ ఇండియా కంపెనీ అణచివేసింది. 1922-24 మధ్య అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన మన్యం తిరుగుబాటు దేశంలో జరిగిన గిరిజన తిరుగుబాట్లలోనే ప్రసిద్ది గాంచింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం అడవిపై హక్కు కోసం ఈ పోరాటం జరిగింది. మూడు సంవత్సరాల పాటు జరిగిన ఈ పోరాటంలో గెరిల్లా యుద్ధ పద్ధతులు కూడా అనుసరించబడ్డాయి. పెద్ద ఎత్తున సాయుధ బలగాలను దించి ఈ పోరాటాన్ని బ్రిటీష్ ప్రభుత్వం అణచివేసింది. కొమరం భీం నాయకత్వంలో 1940లో ఆదిలాబాద్ జిల్లాలోని ధనోరా అడవిలో గోండులు తిరుగుబాటు చేశారు. నివాసాలను బలవంతంగా ఖాళీ చేయించటానికి, అటవీ చట్టానికి, పుల్లరికి, గిరిజనేతరుల ప్రాబల్యానికి వ్యతిరేకంగా ఈ తిరుగుబాటు జరిగింది. నిజాం ప్రభుత్వం అనేక గిరిజన గ్రామాలను తగలబెట్టి కొమరం భీంతో సహా అనేకమందిని క్రూరంగా కాల్చి చంపింది.

1968-70 సంవత్సరాల్లో జరిగిన శ్రీకాకుళ గిరిజనోద్యమానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. వెట్టి చాకిరికి, వడ్డీ వ్యాపారులకు, భూస్వాములు, గిరిజనేతరుల, ఫారెస్టు అధికారుల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, భూమి కోసం, విముక్తి కోసం కమ్యూనిస్టు విప్లవ కారులు ఈ పోరాటం సాగించారు. దురాక్రమణకు గురైన తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకొన్నారు. వెట్టిచాకిరీ రద్దు చేయబడింది. వడ్డీ వ్యాపారులు, భూస్వాములు, గిరిజనేతర సంపన్న వర్గాలు పట్టణాలకు పారిపోయారు. ప్రభుత్వ సాయుధ బలగాలను ఎదిరించే దిశగా ఈ ఉద్యమం అభివృద్ది చెందింది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం తర్వాత, మరొకసారి భూ సమస్యను ఎజండాలోకి తీసుకొచ్చిన ఈ పోరాటాన్ని ప్రభుత్వం రక్తపాతంతో అణచివేసింది.

శ్రీకాకుళ గిరిజనోద్యమం తర్వాత నిలకడగా నిర్మించబడినది తూర్పు గోదావరిజిల్లా కొండమొదలు గిరిజనోద్యమం. 1968 నుండి ఇక్కడ కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో ఉద్యమం కొనసాగు తున్నది. భూస్వాముల పైతందార్ల నుండి వందలాది ఎకరాల భూములను గిరిజనులు స్వాధీనం చేసుకొని దశాబ్దాల నుండి సాగు చేసుకొంటున్నారు. గ్రామాలకు గ్రామాలే ఉద్యమంలో పాల్గొన్నాయి. మితవాద-అతివాద పెడధోరణులను వ్యతిరేకించిన ఈ ఉద్యమం-పరిమిత ప్రాంతములోనైనా-ఇంతకాలంగా నిలకడగా సాగుతున్న గిరిజనోద్యమం మరెక్కడా లేదు.

ఇంకా విజయనగరంజిల్లా దుగ్గేరు, కొమరాడ, సాలూరు ప్రాంతాల్లో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నాయకత్వంలో గిరిజనుల భూపోరాటాలు కొనసాగుతున్నాయి.

## గిరిజన చట్టాలు-వాటి లొసుగులు

ఆదివాసీల తిరుగుబాట్ల ఫలితంగా బ్రిటీష్ వలస పాలకులు, వారి నుండి అధికారాన్ని బదలాయించుకొన్న భారత దళారీ పాలకులు కొన్ని చట్టాలు చేయక తప్పలేదు. ఆ చట్టాల్లో కూడా అనేక లొసుగులు జొప్పించి గిరిజనులను వంచించే విధంగా తయారు చేశారు. 1917లో మద్రాసు రాష్ట్ర బ్రిటీష్ వలస పాలకులు భూబదలాయింపు క్రమబద్దీకరణ చట్టం చేశారు. ఈ చట్ట ప్రకారం ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజనులు మాత్రమే భూములు కలిగియుండవచ్చు లేదా కొనవచ్చు. అయితే చట్టంలో యివ్వబడిన నిర్వచనం ప్రకారం ఏజన్సీ ప్రాంతంలో చాలా కాలంగా నివశిస్తున్న వారిని గిరిజనులుగా గుర్తించటానికి అవకాశం కల్పించారు. దీంతో గిరిజనేతరులు తమ భూములు నిలబెట్టుకోవటమే కాకుండా గిరిజన భూములు కొనటానికి అవకాశం ఏర్పడింది. అందువలన ఈ చట్టం గిరిజనులకు న్యాయం చేయలేకపోయింది. గిరిజనేతరుల చేతుల్లో భూముల కేంద్రీకరణ తగ్గలేదు.

హైద్రాబాద్ రాష్ట్రంలో ట్రైబల్ ఏరియాస్ రెగ్యులేషన్ 1359 పసలీ (కరస్పాండింగ్ టు 1949) అనే చట్టం చేయబడింది. ఈ చట్టం గిరిజన ప్రాంతాల నుండి వలస వచ్చిన వారికి గిరిజన ప్రాంతాలలో భూములు ఉండటాన్ని నిషేధించింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సందర్భముగా హైద్రాబాద్ సంస్థానంలోని తెలంగాణా జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌లో భాగమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 1959లో ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంతాల భూమార్పిడి చట్టం చేసింది. చట్టం చేసినా దీన్ని అమలు పర్చటానికి అవసరమైన మార్గదర్శకాలు రూపొందించలేదు. దీన్ని తెలంగాణ ప్రాంతానికి కూడా వర్తింపజేసింది. దీనికన్నా గిరిజనులకు ఉపయోగంగా ఉన్న పసలీ 1359 షెడ్యూల్డ్ ప్రాంత రెగ్యులేషన్ చట్టాన్ని రద్దు చేసింది. చట్టం ద్వారా భూమార్పిడికి చెందిన వివిధ కేసులు కోర్టు ముందుకు వచ్చినప్పుడు 1959 చట్టానికి నిబంధనలు రూపొందించని కారణంగా చట్టాన్ని అమలు చేయటం కుదరదని కోర్టు తీర్పు యిచ్చింది. కోర్టు తీర్పు తర్వాత కూడా 1959 చట్టం అమలుకు అవసరమైన నియమనిబంధనలు 1969 వరకు ప్రభుత్వం రూపొందించలేదు. ఇంత జాప్యం జరగటం మూలంగా అక్రమంగా ఆక్రమించుకొన్న తమ భూముల రక్షణకు గిరిజనేతర పెత్తందారులు ఉపయోగించుకొన్నారు. ఈ విధంగా ప్రభుత్వం తాను చేసిన చట్టాన్ని తానే నీరుగార్చింది.

## 1969 మహల్-ముఠాల రద్దు చట్టం

ఈ చట్టం ప్రకారం 8సం॥ తక్కువ కాకుండా గిరిజన ప్రాంతాల్లో నివశించే భూములున్న గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వటానికి అనుమతించింది. దీన్ని అవకాశంగా తీసుకొని 8సం॥ల కన్నా ఎక్కువ కాలమే గిరిజన ప్రాంతాల్లో భూమి కలిగి ఉన్నామంటూ పట్టాల కోసం ధరఖాస్తు చేశారు. రెవిన్యూ అధికారులను లోబరుచుకొని పెద్ద ఎత్తున పట్టాలు పొందారు. దీనిపై కోర్టుకు వెళ్ళగా 1969 చట్టం నిబంధనలకు అనుగుణంగా జారీ చేయబడ్డ పట్టాలు 1959 అమలులోకి వచ్చిన భూ మార్పిడి చట్టం పరిధిలోకి రావని హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో 8 సం॥గా భూమి కలిగి ఉన్నామంటూ పత్రాలు చూపిన గిరిజనేతరులందరికీ హక్కు లభించింది. ఈ చట్టం వలన గిరిజనేతర పెత్తందారులంతా- ప్రధానంగా లాభపడ్డారు.

## 1/70 చట్టం

మహత్తర శ్రీకాకుళ గిరిజన పోరాటం భూమి సమస్యను మరొకసారి ముందుకు తేవటం, భూమికోసం అనేక ప్రాంతాల్లో గిరిజనోద్యమాలు ముందుకు రావటంతో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం, 1/70 చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని చెప్తూనే, చట్టంలో అనేక లొసుగులు కల్పించి గిరిజనేతరుల ప్రయోజనాలు కాపాడింది. ఈ చట్టం 1970 నుండి అమలులోకి వస్తున్నట్లు ప్రకటించింది. 1970లోపు భూములపై హక్కు నిరూపించుకొనేందుకు గిరిజనేతరులకు అవకాశం కల్పించబడింది. చట్టం చేసిన దగ్గర నుండి భూమార్పిడి నిషేధించబడింది. గిరిజనేతరులు భూములు కొనటం, గిరిజనులు అమ్మటం చట్ట రీత్యా నేరం. 1970 సం॥కు పూర్వం భూమి హక్కును నిరూపించుకొనేందుకు భూసర్వే సెటిల్‌మెంటును 1970 నుండి 1976 వరకు కొనసాగించి గిరిజనేతరులకు మంచి 'సహకారాన్ని' అందించింది. చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకొని, రెవిన్యూ అధికారులను ప్రలోభపెట్టి గిరిజనులకు చెందాల్సిన వేలాది ఎకరాలను తమ పేర రికార్డుల్లో వ్రాయించుకొన్నారు. వీరి పని పూర్తి అయిన తర్వాతే 1978లో ఏజన్సీ ప్రాంతాల భూమి రిజస్ట్రేషన్‌లను నిషేధించింది.

ప్రభుత్వం యొక్క మోసపూరిత విధానాన్ని గిరిజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. గిరిజనుల ఆందోళన ఫలితంగా భూముల అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. విచారణ జరిపిన ప్రత్యేక అధికారి 1990లో ప్రభుత్వానికి నివేదిక అందచేశారు. నివేదికలో ఎక్కడెక్కడ, ఏ ఏ గిరిజనేతరుడు, ఎంతెంత భూమిని సొంతం చేసుకొందీ అంకెలు, సాక్ష్యాధారాలతో పేర్కొన్నారు.

గిరిజనులకు చెందాల్సిన వేలాది ఎకరాల భూములను గిరిజనేతరులు చట్టవిరుద్ధంగా ఎలా కైంకర్యం చేసుకొందీ, వివిధ ప్రాంతాల్లో వారి ఆధీనంలో ఉన్న భూములే నిదర్శనంగా ఉన్నాయి. భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లో 8,297 మంది గిరిజనేతరులు 29,554.16 హెక్టార్లపై భూమి సర్వే సెటిల్‌మెంటు పట్టాలు సంపాయించారంటే రెవిన్యూ అధికారులను వీరు ఎంతగా ప్రభావితం చేసిందీ అర్థమౌతుంది. ఈ భూములే కాకుండా 19 వేల ఎకరాల ప్రభుత్వ భూములను చట్టవిరుద్ధంగా గిరిజనేతరులు అనుభవిస్తున్నారు. ఖమ్మంజిల్లా ఏజెన్సీలో 1995 లెక్కల ప్రకారం 7,71,604.93 ఎకరాల భూమి ఉంటే 4,07,368 ఎకరాల భూమిని గిరిజనేతరులు అనుభవిస్తున్నారు. వరంగల్‌జిల్లా ములుగు మండలంలో 2 వేల ఎకరాల గిరిజనుల భూముల్లో 1200 ఎకరాలను గిరిజనేతరులు కబ్జా చేశారు. కొత్తగూడ గ్రామంలో 21వేల ఎకరాలు భూములు వీరి స్వాధీనంలో ఉన్నాయి. పశ్చిమ గోదావరిజిల్లాలో వేలాది ఎకరాలతోపాటు వివిధ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా గిరిజనేతరులు అనుభవిస్తున్నారు.

చట్ట విరుద్ధంగా వేలాది ఎకరాలు అనుభవించటమే కాకుండా ఇంకా లక్షలాది ఎకరాల భూములను కోర్టులను అడ్డుపెట్టుకొని వివాదాస్పదం చేశారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 1,18,307 ఎకరాల వివాదాస్పద భూమి వుంది. తప్పుడు రికార్డుల ద్వారా 17,003 కేసుల్లో గిరిజనేతరులు గెలిచి 69,331.31 ఎకరాల గిరిజనుల భూములను కబ్జా చేశారు. పశ్చిమగోదావరిజిల్లా మనుగోపాల, ఇతర ప్రాంతాల్లోను కోర్టుల ద్వారా వేలాది ఎకరాల గిరిజనుల భూములను కబ్జా చేశారు.

## కోర్టుల విరుద్ధ తీర్పులు

1/70 చట్టం రాజ్యాంగబద్ధంగా లేదని, దాన్ని రద్దు చేయాలని గిరిజనేతరులు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేయగా, దానిపై 1988లో సుప్రీంకోర్టు తీర్పు యిస్తూ, అంతకు ముందు హైకోర్టు యిచ్చిన తీర్పునే ఖాయం చేసింది. 1/70 చట్టం రాజ్యాంగబద్ధమేనని, ఇది గిరిజనులు పోగొట్టుకొన్న భూములను తిరిగి పొందేందుకు ఉపకరిస్తుందని, అది లేకపోతే గిరిజనుల ఉనికి ప్రశ్నార్థకమౌతుందని పేర్కొంది.

సుప్రీంకోర్టు తీర్పు ఈ విధంగా ఉన్నా, ఏజెన్సీ భూముల సెటిల్‌మెంటుకి ప్రభుత్వం రూపొందించిన 1/1969, 2/69, 2/70, 1/89 నిబంధనలు 1/70 చట్టం లక్ష్యాన్నే నీరుగార్చింది. ఈ నిబంధనల ద్వారా గిరిజనేతరులు, భూమి సెటిల్‌మెంటు చర్య ద్వారా పట్టాలు పొంది భూమిపై హక్కు సంపాయించారు.

1/70 చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చినా, సర్వే సెటిల్‌మెంటు ద్వారా పట్టాలు పొందిన గిరిజనేతరులపైన 1/70 చట్టం క్రింద కేసులు నమోదు చెల్లదని 1978లో హైకోర్టు న్యాయమూర్తి చిన్నపరెడ్డి, 1983లో జస్టిస్ జీవన్‌రెడ్డిలు తీర్పులు యిచ్చారు. సుప్రీంకోర్టు కూడా దాన్ని ధృవీకరించింది. చట్టం రూపొందించక పూర్వపు బదలాయింపులపై విచారణ చేసే అధికారం 1/70 చట్టం క్రింద, కోర్టులకు లేదని, సుప్రీంకోర్టు బెంచ్ 1996లో తేల్చి చెప్పింది. ఈ తీర్పులు, గిరిజన ప్రాంతాల్లోని భూమి గిరిజనులదేననే సామాజిక, చారిత్రక వాస్తవికతకు విఘాతం కల్గించాయి.

భూమి బదలాయింపు నిబంధనలు, మరింత పటిష్టంగా అమలు చేయటానికి ఆంధ్రా ప్రాంతంలో 1/59 నిబంధనలు 1917 నుండి అమలు చేయాలని, తెలంగాణాలో 1949 నుండి అమలులోకి వచ్చే విధంగా సవరణలు చేయాలని గిరిజన సలహా మండలి 1984లోనే సిఫార్సు చేసినా, ఆ సిఫార్సులను ప్రభుత్వం పట్టించుకోలేదు.

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.రామ్‌కోటి 1/59, 1/70 చట్టాలు రాకముందు భూమి బదలాయింపు పత్రాల చట్టబద్ధతను ప్రశ్నించే అధికారం 1/70 చట్టం క్రింద పేర్కొన్న కోర్టులకు లేదని తీర్పునిచ్చారు.

తాము యిచ్చిన తీర్పులకు వ్యతిరేకంగానే హైకోర్టు, సుప్రీంకోర్టులు తిరిగి తీర్పులు యిచ్చాయి. 1/70 చట్టానికి విరుద్ధంగా సర్వే సెటిల్‌మెంట్ నిబంధనల క్రింద జారీ అయిన పట్టాలను 1/70 చట్టం క్రింద విచారణ చేస్తున్న అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని, అటువంటి భూములను గిరిజనేతరుల నుండి తొలగించవచ్చని 1999లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోదా రఘురామ్ తీర్పు, 1/70 చట్టానికి, ఇతర చట్టాలు లోబడి ఉండాలని 1997లో సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేశాయి. ఈ తీర్పులు గిరిజనులకు న్యాయం చేసేవిగా ఉన్నాయి. ఈ తీర్పులకు అనుగుణంగా 2002లో జి.వో.నెం.68ని విడుదల చేసే లోపే వేలాది ఎకరాలు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లాయి.

ప్రభుత్వం నియమించిన గిర్‌గ్లాని కమీషన్ కూడా అన్యాక్రాంతమైన గిరిజనుల భూములను యుద్ధ ప్రాతిపదికపై స్వాధీనం చేసుకొని గిరిజనులకు పంపిణీ చేయాలని, ప్రభుత్వాధికారులు కాలం చెల్లిన ఉత్తర్వులను అమలుపరుస్తూ గిరిజనేతరుల ప్రయోజనాలు కాపాడుతున్నారని, గిరిజనుల భూములు ఆక్రమించిన గిరిజనేతరులపై ఎస్.సి., ఎస్.టి అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసులు పెట్టి శిక్షించాలని పేర్కొంటూ, అనేక సూచనలతో తన నివేదికను ప్రభుత్వానికి అందచేసింది.

గిరిజనులకు అనుకూలంగా యిచ్చిన హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులను అమలు జరపటానికి ఎటువంటి ప్రయత్నం చేయని పాలకులు, గిరిజనులకు వ్యతిరేకంగా యిచ్చిన తీర్పులను మాత్రం వెంటనే ఆచరణలో పెట్టే చర్యలు చేపడుతున్నారు. గోధవర్మన్, తన ఎస్టేట్ భూములను స్వాధీనం చేసుకొని, విచ్చలవిడిగా చెట్లను నరికివేస్తూ పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారని, దాన్ని ఆపు చేయాలని సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీనిపై 2001లో సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలను జారీ చేసింది. అనధికారకంగా వ్యవసాయ భూముల మూలంగా, అడవుల నరికివేత మూలంగా, అడవులు తరిగిపోయి వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందని, అలా చేస్తున్నవారిని అడవుల నుండి బయటకు పంపండని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీన్ని వెంటనే ఆచరణలో పెట్టే చర్యలను పాలకులు చేపట్టారు.

## అటవీ హక్కుల చట్టం

గిరిజనుల కోసమంటూ ప్రభుత్వం చేసిన చట్టాల్లో అనేక లొసుగులు ఉండటంతో గిరిజనులకు చెందాల్సిన లక్షలాది ఎకరాల భూములు ఇప్పటికీ గిరిజనేతరులే అనుభవిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో 60% అటవీ భూములు గిరిజనేతరుల చేతుల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భూములపైన, అడవిపైన హక్కు మాదేనంటూ దేశవ్యాపితంగా గిరిజన ఉద్యమాలు సాగాయి. అడవిపై ప్రభుత్వ పెత్తనాన్ని ప్రశ్నించాయి. గిరిజనోద్యమాలను చల్లార్చేందుకు అడవిపై గిరిజనుల హక్కును పరిమితం చేసేందుకు 2005లో అటవీ హక్కుల బిల్లును కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ బిల్లు ద్వారా అడవిపై గిరిజనులకు హక్కు కల్పిస్తామంటూనే 1980కి పూర్వం గిరిజనుల ఆక్రమణలో ఉన్నదాన్నే క్రమబద్ధీకరిస్తామని బిల్లులో పేర్కొనటం జరిగింది. ఇది గిరిజనులకు చాలా నష్టాన్ని కలుగజేస్తుంది. ఈ అంశంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో, దానిపై పార్లమెంటరీ కమిటీని ప్రభుత్వం నియమించింది. కమిటీ తన నివేదికలో 2005 నుండి గిరిజనుల స్వాధీనంలోనిభూములను క్రమబద్ధీకరించాలని పేర్కొంది. దీన్ని ప్రభుత్వం వ్యతిరేకించింది.

గిరిజనుల ఆందోళన ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి 2005 డిసెంబర్‌కి పూర్వం గిరిజనుల ఆధీనంలో ఉన్న భూములను క్రమబద్ధీకరిస్తామని చెప్పి 2006 డిసెంబర్ 15న లోక్‌సభలోను, ఆ తర్వాత రాజ్యసభలోను బిల్లును ప్రవేశపెట్టి వాటి ఆమోదం పొందటంతో అది అటవీ హక్కుల చట్టంగా మారింది. ఈ చట్టాన్ని 2008 జనవరి నుండి జమ్మూ-కాశ్మీర్ మినహా దేశమంతటా అమలు జరుపుతున్నట్లు ప్రకటించింది. చట్టంగా మారిన తర్వాత అది అమలులోకి రావటానికి మూడు సంవత్సరాలు పట్టటం దాన్ని అమలు పర్చే ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతున్నది. గిరిజనుల ఆధీనంలో ఉన్న భూములకు 2008 నాటికల్లా పట్టాలు యిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గిరిజనేతరులు భూమిపై హక్కును మూడు తరాలుగా నిరూపించుకోవాలని చెప్పింది. ఇది గిరిజనేతరులకు వరప్రసాదం లాంటిది.

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూముల నిర్ధారణకు సర్వే ప్రారంభించగానే, గిరిజనులకు అటవీ భూములు ఇవ్వటం వలన అడవులకు, పర్యావరణానికి నష్టం జరుగుతుందని మాజీ అటవీ అధికారి జె.వి.శర్మ, మరికొందరు పర్యావరణవాదులు హైకోర్టులో పిటీషన్ వేయటంతో సర్వే ఆగిపోయింది. ఇది గిరిజన వ్యతిరేకమైంది. గిరిజనుల వలన పర్యావరణ సమస్యలు ఏర్పడటం లేదని, బడా పరిశ్రమాధిపతులకు, బహుళజాతి సంస్థలకు విస్తారమైన అడవులను కట్టబెట్టటమే అడవులకు, పర్యావరణానికి నష్టం కలుగుతుందన్న విషయం వీరికి తెలియంది కాదు.

## నీరు గారిన అటవీ హక్కుల చట్టం

హైకోర్టు, పిటీషన్‌ను తిరస్కరించి భూముల పంపిణీకి అనుమతి ఇవ్వటంతో అటవీ భూముల పంపిణీ సమస్య ముందుకు వచ్చింది. 2009 ఆగష్టు నాటికల్లా గిరిజనులకు భూపట్టాలు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. ఆదే క్రమంలో పంపిణీ భూముల పరిమాణాన్ని తగ్గించి చెప్పారు. ముఖ్యమంత్రి మాటల్లోనే దీన్ని గమనిద్దాం.

రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టాన్ని అమలు జరిపి గిరిజన కుటుంబాలకు 10 లక్షల హెక్టార్ల (25 లక్షల ఎకరాలు) అటవీ భూములు పంపిణీ చేస్తామని, ఇప్పటికీ 87 శాతం గిరిజనులు నిరుపేదలుగాను, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని ఈ చట్టం వారి జీవితాల్లో వెలుగు నింపుతుందని 2007 అక్టోబరు 14న గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో ఆనాటి ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

2008 సంవత్సరం నాటికి పంపిణీ చేసే భూముల మోతాదు ముఖ్యమంత్రి మాటల్లోనే మారిపోయింది. రాష్ట్రవ్యాపితంగా గిరిజన కుటుంబాలకు నాలుగున్నర లక్షల హెక్టార్ల (12 లక్షల ఎకరాలలోపు) అటవీ భూములపై హక్కులు యిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 10 ఎకరాలపై హక్కు లభిస్తుందని 2008 జూన్ 15న హైద్రాబాద్‌లో జరిగిన గిరిజన ఐక్య వేదిక సమావేశంలో ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రకటించారు. ఎనిమిది నెలలకాలంలో భూముల సంఖ్య సగం తగ్గింది. దీన్ని గమనిస్తే భూసంస్కరణల చట్టంలో భూముల కుదింపు జరిగినట్లుగానే, అటవీ భూముల పంపిణీలోనూ జరుగుతున్నట్లు వెల్లడైంది.

2008 ఆగస్టు 14 నాటికి ప్రభుత్వ లెక్కల ప్రకారం 2,87,648 వ్యక్తిగత దరఖాస్తులు, ఉమ్మడిగా 3,161 దరఖాస్తులకుగాను 8,73,180 ఎకరాలను గుర్తించటం జరిగింది. అందిన దరఖాస్తుల్లో 1,53,106 దరఖాస్తులకు సంబంధించిన 3,97,952 ఎకరాలను మాత్రమే సర్వే చేయించింది. అందులో కూడా 70,952 దరఖాస్తులను మాత్రమే గుర్తించి, 49,952 దరఖాస్తులకు మాత్రమే ఆమోదం తెలిపింది. అందుకుగాను 1,13,870 ఎకరాలకు మాత్రమే పత్రాలు యిచ్చేందుకు అంగీకారం తెలిపింది.

గిరిజన సంక్షేమశాఖ లెక్కల ప్రకారం 4.42 లక్షల ఎకరాల భూముల కోసం గిరిజనులు పెట్టుకొన్న దరఖాస్తులను జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపి, 1.93 లక్షల ఎకరాలకు సంబంధించిన దరఖాస్తులను తిరస్కరించింది. మరో 4.96 లక్షల ఎకరాలకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. ఈ లెక్కలను పరిశీలిస్తే పంపిణీ చేస్తామన్న 12 లక్షల ఎకరాలకుగాను 4.42 లక్షల ఎకరాలకు మాత్రమే గుర్తింపులు పూర్తి అయ్యాయని, మిగతా భూముల పంపిణీకి ఏర్పాట్లు జరగలేదని స్పష్టమౌతున్నది.

లబ్ధిదారులను గ్రామకమిటీలే ఎన్నిక చేస్తాయని చట్టంలో పేర్కొన్నా వాటిని ఆమోదించాలా, తిరస్కరించాలా అనేది జిల్లా కమిటీలకు అప్పగించటంతో గ్రామకమిటీలకు విలువ లేకుండా పోయింది. జిల్లా కమిటీలపై ఆర్థిక రాజకీయ శక్తుల ప్రభావం వలన నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగి, అటవీ భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఏర్పడింది. లక్షా 93 వేల ఎకరాలకుగాను వచ్చిన గిరిజన దరఖాస్తులను తిరస్కరించటం అనుమానాలు కలగడానికి అవకాశం కల్పిస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అటవీ భూముల సర్వే కూడా సక్రమంగా సాగటం లేదు. అందుకు తగినంత సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం నియమించకపోవటమే కారణం. దీనికి తోడు అటవీశాఖ కూడా నాటకాలాడుతున్నది. అందువలన సర్వే ముందుకు సాగకపోవటమే కాకుండా అనేక అవకతవకలు జరుగుతున్నాయి. సర్వేయర్లకు గ్రామకమిటీలను తోడుచేస్తే సర్వే ఊపు అందుకొనేది. మారుమూల ప్రాంత గ్రామాలకు ఇంతవరకు సర్వే బృందాలు వెళ్లలేదు. రెవిన్యూ- అటవీశాఖ అధికారులు కలసి దరఖాస్తుల ఆధారంగా సర్వేచేసి ఎవరి ఆధీనంలో ఎంత భూమి ఉందో నమోదు చేయాలి. అది జరగటం లేదు. చింతగొంది గ్రామములో ఒక్కో గోండుజాతి గిరిజన కుటుంబం మూడు ఎకరాలకు పైగా అటవీ భూములు సాగుచేస్తుంటే, 10 సెంట్ల నుండి ఎకరంలోపు మాత్రమే సాగు చేస్తున్నట్లు సర్వే బృందాలు నమోదు చేయటం సర్వే జరుగుతున్న తీరుకు అద్దం పడుతున్నది. విశాఖజిల్లాలో మొత్తం 2 లక్షల 30 వేలకు పైగా అటవీ భూములు గిరిజనుల స్వాధీనంలో ఉండగా ఇప్పటివరకు 67 ఎకరాలను మాత్రమే గుర్తించారు. ఈ విధంగా భూముల సర్వే నత్తనడకగా, తప్పులతడకగా సాగుతున్నది. దీనివలన భూముల పంపిణీకి ఆటంకం ఏర్పడుతున్నది. ప్రభుత్వానికి కావాల్సింది అదే కాబట్టి సర్వే ముమ్మరం చేయటానికి చర్యలు తీసుకోవటం లేదు.

గిరిజనుల పోరాటాల ఫలితంగా పాలక ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేసినా, ఆచరణలో వాటిని నిర్వీర్యం చేసే విధానాలు చేపట్టటం వలన గిరిజన హక్కులు హరించబడుతూ, వారి భూములు అన్యాక్రాంతమౌతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అడవిపైన, అటవీ భూములపైన హక్కు మాదేనంటూ గిరిజనేతర పేదలను కలుపుకొని గిరిజనులు సమైక్య పోరాటం సాగించాలి. D

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**విప్లవ ప్రజా ఉద్యమం**
**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు**
**సావధానంగా చర్చిద్దాం!**
**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**
వెల: 10.00
***కాపీలకు:***
**మైత్రీ బుక్ హౌస్**
**జలీల్ వీధి, అరండల్‌పేట,**
**విజయవాడ**

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**ఆంధ్రప్రదేశ్ విభజన**
**కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి**
**కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి**
**వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల**
**వ్యాస సంకలనం**
వెల: రు. **15/-**

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**విభజనవాద-సమైక్యవాద**
**మూలాలు**
**మార్క్సిస్టు పరిశీలన-కర్తవ్యాలు**
వెల: రు. **5/-**
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# 2012 జనవరి 6న - చిత్రుదళం కద్రక వెంకన్నను హత్య చేయడాన్ని ఖండించండి!

**ఒరిస్సా** రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, బందుగావ్ బ్లాక్‌లో ఛాసీమూలియా ఆదివాసీ సంఘ్ కార్యకర్త కద్రక వెంకన్నను 2012 జనవరి 6వ తేదీ రాత్రి 8 గంటలకు చిత్రు దళం హత్యచేసింది. ఈ దళమే ఇతర విప్లవ సంస్థలకు చెందిన కామ్రేడ్సును బెదిరిస్తున్నది, కిడ్నాపులు చేస్తున్నది.

ఈ హత్యను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. తానొక విప్లవ సంస్థకు చెందిన దానినని చిత్రుదళం చెప్పుకుంటున్నది. తాము ఒక సంఘంగా ఏర్పడేందుకు ప్రజలకున్న ప్రజాస్వామిక హక్కును ఈ రకపు హత్యలు ఉల్లంఘించేవిగా వున్నాయి. ఇది విప్లవానికి హానికరమైనది.

కద్రక వెంకన్న హత్యను ఖండించమనీ, తాము సంఘంగా ఏర్పడే ప్రజల ప్రజాస్వామ్య హక్కు రక్షణకు నిలబడమనీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

**7-1-12**

విశ్వం
ప్రధాన కార్యదర్శి
సిపిఐ (ఎం-ఎల్)

అలోక్ ముఖర్జీ
ప్రధానకార్యదర్శి
సిపిఐ (ఎం-ఎల్)
కేంద్ర పత్రిక -జనశక్తి

# రష్యా, అమెరికా, చైనాలలో కమ్యూనిస్టుల కొన్ని కార్యక్రమాలు

## రష్యా

2011 జులై 15వ తేదీన రష్యాలోని పెంజా పట్టణంలో స్థానిక కమ్యూనిస్టు పార్టీ శాఖ కార్యాలయ ఆవరణలో కామ్రేడ్ స్టాలిన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్టాలిన్ స్మారక విగ్రహాన్ని ఆవిష్కరించవలసిందిగా నాడు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న యోధులు కమ్యూనిస్టుపార్టీని అభ్యర్ధించారు. కా॥ స్టాలిన్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రెండవ ప్రపంచ యద్ధంలో పాల్గొన్న ఆనాటి యోధులైన ఈనాటి వృద్ధులు 60 మందితో పాటు స్థానిక ప్రజలు హాజరయ్యారు.

స్థానిక ప్రజల నుండి సేకరించిన 2 లక్షల రూబుళ్ళ విరాళాలతో స్టాలిన్ విగ్రహాన్ని రూపొందించారు. 1950 చివరలో కృశ్చేవ్ స్టాలిన్ విగ్రహాలన్నింటినీ కూల్చివేసిన పిదప పెంజా పట్టణంలో స్టాలిన్ విగ్రహాల్ని ప్రతిష్టించటం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా కూడా మానవ హక్కుల కార్యకర్తలతోపాటుగా రష్యా అధ్యక్షులు మిద్వదెవ్, ప్రధాని పుతిన్‌లు పెంజాలో జరిగిన స్టాలిన్ విగ్రహ ప్రతిష్టాపనను ఖండించారు. రష్యాలోని పలు పట్టణాల్లో చాలా కాలంగా ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ, స్టానిక అధికార యంత్రాంగం దానికి నిరాకరిస్తూవస్తున్నది.

సాఫా రిపబ్లిక్ లోని మిర్ని లోనూ, అమల్ గ్రామంలోనూ మాత్రమే వారు ఇప్పటికి స్మారక విగ్రహాలను ఏర్పరచగలిగారు. యకుత్సుక్ మరియు పోక్రోవ్స్క్‌లవద్ద కమ్యూనిస్టులు చాలాకాలంగా ఈ విగ్రహాల స్థాపనకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత సంవత్సరం యేకాతెరీఇన్‌బర్గ్ ప్రాంతంలో కమ్యూనిస్టులు స్టాలిన్ స్మారక విగ్రహాన్ని ప్రతిష్టించుకునేందుకు అనుమతినీయవలసిందిగా కోరుతూ చేసిన విజ్ఞప్తి ఇంకా అనుమతి పొందేందుకై వేచివుంది.

2009 అక్టోబర్‌లో కుర్‌స్కా మెట్రో రైల్వేస్టేషన్ వద్ద స్టాలిన్ విగ్రహ ప్రతిష్టాపనకు ప్రయత్నించగా, ప్రజల నిరసనాందోళనల సాకుతో నగర మేయర్ దీనిని ఆపివేశారు.

2006లో స్టాలిన్ విగ్రహాన్ని ప్రతిష్టించిన కొన్ని గంటలలోనే స్థానిక అధికారుల ఆదేశం మేరకు పోలీసులు ఆ విగ్రహాన్ని గంటల వ్యవధిలోనే తొలగించారు.

ఏమైనా, లెవెడా ఇండిపెండెంట్ సెంటర్ ఇటీవల కాలంలో నిర్వహించిన సర్వేలో, రష్యాలోని సగం జనాభా తమ ప్రియతమ నాయకునిగా జె.వి. స్టాలిన్‌ను పేర్కొన్నారని ప్రకటించింది.

## అమెరికా

అమెరికా కమ్యూనిస్టు పార్టీ వృద్ధ యుద్ధయోధులతో ఒక కమిటీని ఏర్పరిచింది. ఇటీవల అమెరికాలోని అనేకమంది వృద్ధ యుద్ధ యోధులు అమెరికా కమ్యూనిస్టు పార్టీలోనూ, అమెరికా యూత్ కమ్యూనిస్టు లీగ్‌లోనూ చేరుతున్నారు.

వీరిలో అధికులు ఇరాక్‌పై అమెరికా సాగించిన దురాక్రమణ యుద్ధంలో పాల్గొన్నవారే. అక్కడి ఘోరమైన పరిస్థితులు, భయంకరమైన, అమానవీయమైన అనుభవాలు పీడకలల్లా వారిని వెన్నాడుతున్నాయి. వీరిలో అనేకమంది తీవ్రమైన గాయల కారణంగానూ, వీటి ఫలితంగా ఉత్పన్న మయ్యే వివిధ మానసిక వత్తిడులకు బాధలనుభవిస్తూ, వీటిని మరచిపోయేందుకు మత్తు మందులకు, మద్యానికి బానిసలవుతున్నారు.

యుద్ధభూమి నుండి అమెరికా చేరుకున్న తర్వాత కొందరు సైనికులు విడాకుల సమస్యనెదుర్కొన్నారు. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇంకొందరు ఆఫ్ఘనిస్థాన్ పంపబడుతున్నారు. వీరంతా అమెరికాలో వివక్షతను ఎదుర్కొంటున్నారు. వీరంతా ఉద్యోగం, ఉపాధి లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.

ఈ విషాద, చేదు అనుభవాలన్నీ, అమెరికా సామ్రాజ్యవాద విదేశాంగ విధానం యొక్క, పెట్టుబడిదారీ విధానం యొక్క వాస్తవ స్వభావాన్ని అర్ధం చేసుకోవటానికి వారికి తోడ్పడ్డాయి.

సామ్యవాదమే సరైన మార్గమనీ, అది మాత్రమే నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రజలకందించ గలదనీ ఇప్పుడు వారు నిర్ధారించుకోగలుగుతున్నారు.

## చైనా

మావో జన్మించిన చైనాలోని హునాన్ రాష్ట్రం-షవోషాన్‌లో ఆయన 118వ జయంతిని 26-12-2011న జరుపుకున్నారు. డిసెంబర్ 26 ఉదయం వందలాదిమంది సైనికులు, విద్యార్థులు, పదవీ విరమణ పొందిన వృద్ధులు వందలాదిమంది- తీవ్రమైన చలిగాలులను లెక్కచేయకుండా షవోషన్ ప్రధాన కూడలివద్ద బారులు తీరారు. అక్కడ నిర్మించబడిన ఒక ఎత్తైన మావో విగ్రహం వద్ద నివాళు లర్పించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుకై వేచివుండి తలలు వంచి శ్రద్ధాంజలిఘటిస్తూ పూలమాలలతో నివాళులర్పించారు.

చైనా ప్రజారిపబ్లిక్ సంస్థాపకుడూ, విప్లవ విజయంలో ప్రధాన పాత్ర పోషించిన గొప్ప నాయకుడుగా మావోను కొనియాడుతూ, వృద్ధులు ఆయనపట్ల తమ ప్రేమాభిమానాల్ని వ్యక్తం చేశారు.

ప్రస్తుత చైనా కమ్యూనిస్టు పార్టీ- 'గొప్ప ముందడుగు' కాలంలోనూ, 'సాంస్కృతిక విప్లవ' కాలంలోనూ మావో నిర్వహించిన పాత్రపై చర్చలను నిర్వహిస్తున్నది. తద్వారా మావో పొరపాట్లుగా చెప్పబడుతున్నవాటిని ఎత్తి చూపటానికి పూనుకున్నది. కాగా, మావో జెండాంగ్ పట్ల తమకున్న ప్రేమాభిమానాలను చాటిచెపుతూ షవోషన్ దర్శించు కుంటున్న వారి సంఖ్య ప్రతి ఏటా 10 శాతం పెరుగుతున్నది. D

# కోటిపాం విద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళనా ప్రాంతంలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర బృందం పర్యటన



కోటిపాం ప్రాంతంలో పర్యటిస్తున్న రాష్ట్రబృందం-ఈ సందర్భంగా హాజరైన ప్రజలు

**కోటిపాం, 7-1-12 :**

**కోటిపాం** ఆల్ఫా ఇన్‌ఫ్రాప్ ప్రవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన భారీ థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజలు సాగిస్తున్న ఉద్యమాన్ని, ముఖ్యంగా ఇటీవల పరిణామాలను పరిశీలించడానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) కమిటి నాయకత్వంలో 5గురు సభ్యులతో కమిటిగా ఏర్పడి కోటిపాం, గుమడ అగ్రహారం, కొమరాడ, కొత్తవలస, పెద్దఖర్జిల, చినఖర్జిల, రేగులపాడు, లింగదొరవలస, భూర్జివలస గ్రామాలతో పాటు వనకాబడి రిజర్వాయర్ మరియు వనకాబడిగెడ్డ ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ కమిటీలో రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రిఝాన్సి, రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ డి. వర్మ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ టి. అరుణ, జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బి. నరసింగరావు; ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥ బెహరా శంకర్రావు సభ్యులుగా ఉన్నారు.

పరిశీలన అనంతరం కంపెనీ యాజమాన్యం యొక్క అక్రమాలు, రెవిన్యూయంత్రాంగం యొక్క నిర్లక్ష్య వైఖరి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతూ ఆందోళనోద్యమాన్ని ముందుకు కొనసాగించాలని కమిటి పిలుపునిచ్చింది.

1. గిరిజనులు, పేదరైతులు సాగుచేసుకొని బ్రతుకుతున్న డిఫారం పట్టాభూములు, బంజరు, పోరంబోకు, కొండ పోరంబోకు భూములను ఒక ప్రవేటు సంస్థకు అప్పగించటం ద్వారా ప్రభుత్వం ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీసింది. ప్రవేటు యాజమాన్య ప్రయోజనాల కోసం సుమారు 700 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జీ.వో. చేయడం ప్రజా వ్యతిరేక చర్య.
2. ఈ ప్రాంతం అభివృద్ధికి ఉపయోగపడే వనకాబడి మిని రిజర్వాయర్‌కు సుమారు 7 కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుచేసిన పిదప ఈ కంపెనీకి అనుమతినివ్వటం ద్వారా రిజర్వాయర్ పనులు నిలిపివేసి 1030 ఎకరాల భూములకు సాగు నీరు అందకుండా తీవ్రంగా నష్టంచేసారు.
3. చెరువులను అభివృద్ధి పరిచి నీటివనరులను రక్షించాలని ప్రభుత్వం జీవో చేసినప్పటికీ, దీనిని అతిక్రమించి సుమారు 32 చెరువులను థర్మల్ కంపెనీకి అప్పగించడం దుర్మార్గమైన చర్య. ఈ చెరువులపైన ఆధారపడి సాగు అవుతున్న భూములకు, చేపలను పెంచి ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు తీవ్రమైన నష్టం కలుగుతున్నది.
4. ఈ కంపెనీకి నాగావళి నుండి $2^{1}/_{2}$ టి.ఎమ్.సీల నీటిని వాడుకోవడానికి అవకాశమిస్తే సుమారు 25 వేల ఎకరాలకు సాగునీటిని కోల్పోతారు. జంఝావతి రిజర్వాయర్‌కు ఆనుకొని యాష్ పాండ్ కట్టడం ద్వారా జంఝావతి రిజర్వాయర్ జలాలు కలుషితం అవుతాయి. ప్లాంట్ ద్వారా విడుదల అయ్యే కలుషితమైన నీరు నాగావళిలో కలవడం వలన తోటపల్లి రిజర్వాయర్ కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. దీని ఫలితంగా భూములకు, సాగు నీటికి, త్రాగునీటికి పెద్ద ఎత్తున నష్టం జరగనుంది.
5. సహజ సిద్ధంగా పారుతున్న వనకాబడిగెడ్డపైన ఆధారపడి కోటిపాంలో సుమారు 500 ఎకరాల సాగునీటికి నష్టం కలిగించడానికి కంపెనీ యాజమాన్యం దుర్మార్గంగా గెడ్డను ఆక్రమించి కంచె వేయడానికి పనులు ప్రారంభిస్తున్నది. భవిష్యత్తులో ఈ గెడ్డను కంపెనీలో కలుపుకొని శాశ్వతంగా సాగునీటిని అందకుండా చేస్తుంది.
6. కొమరాడ, కొత్తవలస గ్రామాలలో గిరిజనుల డి.పట్టా భూముల సమస్య, సర్వే సమస్య తేలకుండానే ఆ భూములను ఆక్రమించి కంచె వేయడానికి కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తున్నది.
7. లింగందొరవలస, రేగులపాడు రెండు గ్రామాలను పూర్తిగా తొలగించి నిర్వాసితులను చేయడానికి ప్రయత్నిస్తున్నది.
8. కంపెనీ యాజమాన్యం ప్రజల భూములు చుట్టూ కంచె వేయడానికి ప్రయత్నిస్తున్నది. మధ్యలో సాగుచేస్తున్న రైతులను భూమిలోకి వెళ్ళనీయకుండా, ఆ భూములను కంపెనీకి ఎంతో కొంతకి అమ్ముకోండని, లేదంటే ఏమీచేయలేరని బెదిరిస్తున్నది.
9. పంట భూములకు, సాగునీటి వనరులకు, పర్యావరణానికి నష్టం కలిగించే-ప్రవేట్ కంపెనీకి ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తున్నది.
10. కంపెనీ యాజమాన్యం ప్రజలపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తున్నది. పై సమస్యలను-ముఖ్యంగా కోటిపాంలోని 500 ఎకరాల భూమికి సాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) ప్రతినిధి బృందం స్థానిక ఆర్‌డిఓను కలిసి డిమాండ్ చేసింది. D





వెలువడింది!

**రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద**

(వ్యాససంకలనం)

సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ

కాపీలకు : వెల: 12/-

**మైత్రీ బుక్ హౌస్**

28-9-1,జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2


Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010